




# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 218 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 14 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 218 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 14 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


### అనకాపల్లి బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు..

# ఎనిమిది మంది మృతి

- బాణసంచా ప్రమాదంలో ఎనిమిదికి పెరిగిన మృతుల సంఖ్య... రూ.15 లక్షల చొప్పున పరిహారం
- అనకాపల్లి జిల్లాలో విషాదం
- కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన హెూం మంత్రి అనిత





పెన్ పవర్ డెస్క్:బాణసంచా తయారీ కర్మాగారంలో పేలుడు ఘటన అనకాపల్లి జిల్లాలో విషాదాన్ని నింపింది. కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఇవాళ ఓ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం జరిగింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి పెరిగింది. ఈ ప్రమాదంలో మరికొందరికి తీవ్ర గాయాలు కాగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతులను... కైలాసపట్నంకు చెందిన అప్పికొండ తాతబాబు (50), సంగరాతి గోవింద్ (40), దేవర నిర్మల (38), పురం పాప (40), గుప్పిన వేణుబాబు (34)... భీమిలికి చెందిన హేమంత్ (20), రాజుపేటకు చెందిన దాడి రామలక్ష్మి (35), చౌడువాడకు చెందిన సేనాపతి బాబూరావు (55)గా గుర్తించారు. ప్రమాద సమయంలో బాణసంచా తయారీ కేంద్రంలో 15 మంది కార్మికులు ఉన్నారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ విచారణకు ఆదేశించారు.కాగా, హెూం మంత్రి అనిత కైలాసపట్నం చేరుకుని ప్రమాద స్థలిని పరిశీలించారు. ప్రమాద ఘటనపై స్థానికులు, అధికారులతో ఆమె మాట్లాడారు. ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు మంత్రి అనిత రూ.15 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రమాదం జరిగిన వెంటనే అధికారులు సహాయక చర్యలు చేపట్టారని వెల్లడించారు. ఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందారని, ఏడుగురికి గాయాలయ్యాయని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించామని అనిత చెప్పారు. అగ్నిప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేవ్ ఆరా తీశారని వెల్లడించారు. ఈ ప్రమాద ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుందని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### 2025 సీనియర్ ఇంటర్ ఫలితాల్లో

# ఆదిత్య విజయకేతనం

### నల్లమిల్లి సవితకు రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానం






**మండపేట, పెన్ పవర్ ఏప్రిల్ 13:** 2025 సంవత్సరానికి సంబంధించిన సీనియర్ ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండపేట ఆదిత్య జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థిని నల్లమిల్లి సవిత అసాధారణ విజయం సాధించింది. ఎం.పి.సి. గ్రూపులో గరిష్ఠమైన 1000 మార్కులకు గాను 992 మార్కులు సాధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ ను పొందింది.ఈ సందర్భంగా ఆదిత్య జూనియర్ కాలేజీ డైరెక్టర్ చిర్ల జె. సుబ్బిరెడ్డి ఈ విషయాన్ని ప్రకటిస్తూ, నల్లమిల్లి సవిత కృషిని ప్రశంసించారు. ఆమె సాధించిన ఈ అత్యున్నత విజయానికి కారణమైన తల్లిదండ్రులను, కష్టపడి బోధన చేసిన అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు.విద్యార్థినికి నిత్యం చేయూతనందించిన విశాఖపట్నం నివాసి, రామవరం వాస్తవ్యుడు చింతా వెంకట రెడ్డి సహకారం అమూల్యమని పేర్కొన్నారు.ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి , సెక్రటరీ కృష్ణదీపక్ రెడ్డి సవితను, ఆమె తల్లిదండ్రులను, మెంటార్లను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఈ విజయంతో ఆదిత్య విద్యాసంస్థల ప్రతిష్ఠ మరింత పెరిగిందని తెలిపారు.ఇటువంటి ఘనవిజయాలు విద్యార్థుల కృషికి, ఉపాధ్యాయుల మార్గదర్శనానికి నిదర్శనమని, రాబోయే విద్యార్థులకు ఇది ప్రేరణగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

### తజకిస్థాన్, మయన్మార్ లలో

# భూకంపం



పెన్ పవర్ డెస్క్:తజికిస్థాన్‌లో ఆదివారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.4 పాయింట్లుగా నమోదైంది. ఆదివారం ఉదయం 9.54 గంటల ప్రాంతంలో భూమి


వివరాలు 2లో..


### కుమార్తెను నరబలి ఇచ్చిన తల్లికి మరణశిక్ష ....

# సూర్యాపేట కోర్టు సంచలన తీర్పు

- 2021లో దారుణ ఘటన
- సర్పదోషం పోగొట్టుకునేందుకు కన్నబిడ్డనే బలి
- గతంలో భర్తపై తూకం రాయితో దాడి
- అరుదైన కేసుగా భావించి మరణశిక్ష విధించిన న్యాయస్థానం


వివరాలు 2లో..







## ఎడిటర్ వ్యూ

## అంతా ఆయనే చేశాడు.. ధర్మరాజు కాదు..
# ఆయన దృతరాష్ట్రుడు

తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు ఎప్పుడూ హీట్ గానే కొనసాగుతుంటాయి. కూల్ గా సరదాగా సాగితేనే ఆశ్చర్యపోవాలి. తప్పించి నేతల మధ్య ఆరోపణలు రావడం ఎప్పుడూ మామూలే. కాంగ్రెస్ కూడా వీటిని పెద్దగా పట్టించుకోదు. తాజాగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ కోవలోకి చెందినవే. మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని, తనకు మంత్రి పదవి వస్తుందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గట్టిగా నమ్మారు. అంతేకాదు ఒక అడుగు ముందుకేసి తనకు హోంశాఖ అంటే ఇష్టమని కూడా ఆయన మీడియాతో అన్నారంటే కోమటిరెడ్డి ఎంత కాన్ఫడెన్స్ గా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. అయితే ఏప్రిల్ 3వ తేదీన మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని భావించినా అది జరగలేదు.

**మంత్రివర్గ విస్తరణ జరగకపోవడానికి...**

అయితే మంత్రి వర్గ విస్తరణ జరగకపోవడానికి, తనకు మంత్రి పదవి రాకపోవడానికి కారణం జానారెడ్డి అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బాంబు పేల్చారు. జానారెడ్డి, కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కుటుంబాలు మొత్తం మూడు గ్రూపులుగా నల్లగొండ జిల్లా కాంగ్రెస్ ను శాసిస్తున్నాయి.ముగ్గురు సీనియర్ నేతలు, ముగ్గురు కాంగ్రెస్ లో కీలక నేతలు కావడంతో అధికారంలోకి వస్తే ఈ జిల్లా నుంచి ముగ్గురు మంత్రి వర్గంలోకి రావడం గ్యారంటీ. అయితే ఈసారి జానారెడ్డి ఎన్నికలకు దూరంగా ఉండటంతో ఆయన కుమారుడు పోటీ చేసి విజయం సాధించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే కేబినెట్ లో ఉన్నారు. అయితే మూడో మంత్రి పదవి అదే జిల్లాకు చెందిన, ఒకే సామాజికవర్గానికి చెందిన నేతకు ఇవ్వడంపై అనేక విమర్శలు తలెత్తాయి.

**ఎన్నికలకు ముందు...**

గత ఎన్నికలకు ముందు తాను కాంగ్రెస్ లోకి రావడానికి పార్టీ అధికారంలోకి వస్తే మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెబుతున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో ఉన్న సోదరుడు వెంకటరెడ్డికి మంత్రి పదవి ఇచ్చినా తన పదవికి ఢోకా ఉండదని ఆయన ధీమాగా ఉన్నారు. కానీ జానారెడ్డి రాసిన లేఖతో తనకు మంత్రి పదవి పెండింగ్ లో పడిపోయిందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అభిప్రాయపడుతున్నారు. అదే విషయాన్ని మీడియాకు బహిరంగంగానే చెప్పారు. నిజానికి జానారెడ్డి అధినాయకత్వానికి లేఖ రాశారు. కానీ అందులో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా నేతలకు మంత్రి వర్గ విస్తరణలో చోటు కల్పించాలని మాత్రమే రాశారు.

**మంత్రి పదవి రాకుండా...**

కానీ తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకునేందుకే జానారెడ్డి ఈ లేఖను రాశారంటూ జానారెడ్డిపై ఫైర్ అయ్యారు. అధినాయకత్వం తనకు మంత్రి పదవి ఇవ్వాలని భావించినా కొందరికి చెమటలు పడుతున్నాయని, ధర్మరాజుగా ఉండాల్సిన జానారెడ్డి దృతరాష్ట్రుడిగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుపడింది జానారెడ్డి అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పదవిని అడుక్కునే పరిస్థితుల్లో తాను లేనని, తననుచూసి అందరూ ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదని, అన్నదమ్ములకు మంత్రిపదవి ఇస్తే తప్పేంటని ఆయన ప్రశ్నిస్తున్నారు. దీంతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇకరాదని తెలిపోయినట్లేనని కాంగ్రెస్ నేతలే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## కుమార్తెను నరబలి ఇచ్చిన తల్లికి మరణశిక్ష ....
# సూర్యాపేట కోర్టు సంచలన తీర్పు

- మొదటి పేజి తరువాయి

పెన్ పవర్ డెస్క్:సూర్యాపేట కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. 2021లో తన సొంత బిడ్డను నరబలి ఇచ్చిన బి. భారతి అనే మహిళకు మరణ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. భారతి తనకున్న 'సర్ప దోషం' తొలగిపోవాలనే దురుద్దేశంతో ఈ దారుణానికి ఒడిగట్టింది. భర్తపై తూకం రాయితో దాడి చేసిన కేసులో ఆమె గతంలోనే జైలు శిక్ష అనుభవించింది. ఈ నేరం కూడా ఆమెకు మరణ శిక్ష పడటానికి ఒక కారణంగా మారింది.మోతే మండలం మేకలపాటి తండాలో 2021 ఏప్రిల్ 15న ఈ దారుణం జరిగింది. భారతి ఇంట్లో ప్రత్యేక పూజలు చేస్తూ, ఏడు నెలల పసికందు గొంతు కోసి, నాలుకను కూడా కోసింది. ఆ సమయంలో ఆమె భర్త కృష్ణ, అనారోగ్యంతో మంచానపడిన మామ మాత్రమే ఇంట్లో ఉన్నారు. బిడ్డ ఏడుపు విని మామ లేచి చూడగా, రక్తపు మరకలతో భారతి బయటకు వస్తూ కనిపించింది. దేవుళ్ళకు బలి ఇచ్చి సర్పదోషం పోగొట్టుకున్నానని భారతి చెప్పింది.వెంటనే ఈ విషయాన్ని ఆయన తన కుమారుడు కృష్ణకు చెప్పారు. దాంతో కృష్ణ బంధువులకు, ఇరుగుపొరుగు వారికి విషయం చెప్పడంతో వారు చిన్నారిని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే పాప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోతే పోలీసులు భారతిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో పోలీసులు 10 మంది సాక్షులను విచారించారు. భారతికి సర్పదోషం ఉందని, దాని నివారణ కోసమే ఈ దారుణానికి ఒడిగట్టిందని కృష్ణ తెలిపాడు. అంతేకాకుండా, 2023లో కృష్ణ నిద్రిస్తుండగా భారతి తూకం రాయితో తలపై దాడి చేసింది. ఈ దాడిలో కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ కేసులో భారతికి ఏడాది జైలు శిక్ష పడింది. పాఠశాలలో భారతి, కృష్ణ క్లాస్‌మేట్స్. ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో మొదట ఆమెకు వేరే వ్యక్తితో వివాహం జరిగింది. ఆ తర్వాత మనస్పర్థల కారణంగా విడాకులు తీసుకున్నారు. 2019లో కృష్ణ, భారతి వివాహం చేసుకున్నారు. పెళ్లికి ముందు భారతి మానసిక సమస్యలతో బాధపడేదని, ఖమ్మంలో మానసిక వైద్యులను కూడా సంప్రదించామని కృష్ణ తెలిపాడు. ప్రస్తుతం భారతి చంచల్‌గూడ మహిళా జైలులో ఉంది. అన్ని సాక్ష్యాలను పరిశీలించిన తర్వాత కోర్టు ఈ కేసును 'అరుదైన కేసు'గా పరిగణించి భారతికి మరణ శిక్ష విధించింది.

## అమెరికా కొత్త నిబంధన...
## లేకపోతే దేశం విడిచి వెళ్లిపోవాల్సిందే!

- మొదటి పేజి తరువాయి

మించి అమెరికాలో నివసిస్తున్న ప్రతి ఒక్కరూ ఫెడరల్ గవర్నమెంట్ వద్ద తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది.

ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై నేరారోపణలు మోపి, జరిమానా విధించడంతో పాటు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉందని అమెరికా హోం శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఎటువంటి సమస్యలు లేకుండా ఉండాలంటే, వెంటనే అమెరికాను విడిచి వెళ్ళడమే ఉత్తమ మార్గమని సూచించింది.

అమెరికాను వీడటానికి ఇదే సరైన సమయమని, సామాను సర్దుకుని స్వదేశానికి విమానం ఎక్కాలని హోం శాఖ సూచించింది. ఎటువంటి నేర చరిత్ర లేనివారు, ఇక్కడ సంపాదించుకున్న డబ్బుతో నిశ్చింతగా వెళ్లిపోవచ్చని తెలిపింది. ఒకవేళ ఎవరికైనా విమాన టికెట్ కొనుగోలు చేసే స్థోమత లేకపోతే, అమెరికా ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తుందని పేర్కొంది. నిబంధనలు పాటించని వారిని వెంటనే దేశం నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించింది. అంతేకాకుండా, బహిష్కరణ ఆదేశాలు అందుకున్న వారు ఒక్క రోజు ఎక్కువ సమయం ఉన్నా రోజుకు 998 డాలర్లు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని, సొంతంగా వెళ్ళిపోకపోతే 1,000 నుండి 5,000 డాలర్ల వరకు జరిమానా విధిస్తామని తెలిపింది. భవిష్యత్తులో వారు చట్టపరమైన మార్గాల ద్వారా కూడా అమెరికాలో మళ్లీ ప్రవేశించే అవకాశం కోల్పోతారని హెచ్చరించింది.ఈ నిబంధనలు ప్రధానంగా హెచ్1బీ మరియు విద్యార్థి వీసాలపై ఉండేవారికి వర్తించనప్పటికీ, సరైన అనుమతులు లేకుండా అమెరికాలో నివసిస్తున్న వారిపై మాత్రం కచ్చితంగా ప్రభావం చూపుతాయని తెలుస్తోంది. ఒకవేళ హెచ్1బీ వీసాపై వచ్చి ఉద్యోగం కోల్పోయిన వారు నిర్ణీత గడువు దాటి ఇక్కడ ఉంటే వారిపై చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు మరియు హెచ్1బీ వీసాదారులు అమెరికా చట్టాలు సూచించిన అన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

## ఉక్రెయిన్, రష్యా యుద్ధం..సుమీ
## నగరంపై మిస్సైల్ దాడి.. 21మంది మృతి

- మొదటి పేజి తరువాయి

కార్యాలయం ప్రకటించింది. ఆదివారం ఉదయం 10:15 గంటలకు పామ్ సండే జరుపుకోవడానికి గుమికూడిన ప్రజలపై రెండు బాలిస్టిక్ క్షిపణులు సుమీ నగరం మధ్యలోకి దూసుకెళ్లాయని అధికారులు తెలిపారు. సంఘటన స్థలం నుండి అధికారిక ఛానెల్‌లలో షేర్ చేయబడిన వీడియోలు నగరం మధ్య ప్రాంతాలలో శిథిలాలు ,పొగ మధ్య మృతదేహాలు పడి ఉన్నట్లు చూపించాయి.

శనివారం తెల్లవారుజామున ఉక్రెయిన్‌లోని కైవ్‌లోని ఇండియాకు చెందిన ఫార్మాస్యూటికల్ కంపెనీ గిడ్డంగిపై రష్యా క్షిపణి దాడులు జరిగిన విషయం తెలిసిందే. భారత్ లోని ఆ దేశ రాయబార కార్యాలయం ధృవీకరించింది. భారత్ తో ప్రత్యేక స్నేహం అంటూనే రష్యా ఉక్రెయిన్‌లోని భారతీయ వ్యాపారాలను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుంటుందని ఆరోపించింది.

ధ్వంసమైన గోడౌన్ ఉక్రెయిన్‌లోని అతిపెద్ద ఫార్మా కంపెనీలలో ఒకటైన కుసుమ్ అనే ఫార్మాస్యూటికల్ కంపెనీకి చెందినది.కుసుమ్ హెల్త్‌కేర్ మానవతా ప్రయోజనాల కోసం ఉపయోగించే అవసరమైన వైద్య సామాగ్రిని నిల్వ చేసింది. ఈ కంపెనీ భారతీయ వ్యాపారవేత్త రాజీవ్ గుప్తా యాజమాన్యంలో ఉంది.

## కేటీఆర్ పై మంత్రి పొన్నం సంచలన వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

మాట్లాడేది ఆయనకే అర్థం కావడం లేదని అన్నారు. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి బీజేపీ ఎంపీ వెనకుండి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాడన్న కేటీఆర్ ఆరోపణలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆ ఎంపీ పేరు చెప్పే దమ్ము, ధైర్యం లేదా అని కేటీఆర్ ను ప్రశ్నించారు. బీజేపీ నేతలు అవివేకంతో ఇష్టారీతిన మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం విమర్శించారు. సీఎం మార్పుపై ప్రకటనలు చేస్తూ వారి అవివేకాన్ని బయటపెట్టుకుంటున్నారని అన్నారు. ఒకవేళ సీఎంను మార్చాలని అధిష్టానం నిర్ణయం తీసుకుంటే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఎప్పుడో ప్రకటన చేసేవారని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

## అమెరికా సందర్శన హక్కు కాదు, ఒక అవకాశం మాత్రమే

- మొదటి పేజి తరువాయి

నుంచి మినహాయింపు ఉండదని రూబియో తేల్చి చెప్పారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన విధానాలను రూబియో సమర్థించారు. అమెరికా జాతీయ భద్రత, వలస విధానాల విషయంలో రాజీపడేది లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. ఇటీవల అమెరికాలోని కొన్ని కళాశాలల్లో అంతర్జాతీయ విద్యార్థులు చేసిన ఆందోళనలను ప్రస్తావించారు. కొలంబియా యూనివర్సిటీ విద్యార్థి మహమూద్ ఖలీల్ ఉదంతాన్ని ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. ఇజ్రాయెల్ వ్యతిరేక నిరసనల్లో పాల్గొన్నందుకు ఖలీల్‌ను దేశం నుంచి పంపించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అమెరికా చట్టాలను, విలువలను గౌరవించే వారికే ఇక్కడకు వచ్చే అవకాశం ఉంటుందని రూబియో స్పష్టం చేశారు.వీసా నిబంధనలను అతిక్రమించినా, నేరాలకు పాల్పడినా, హమాస్ లేదా హిజ్బుల్లా వంటి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నా వీసాలను రద్దు చేసి, వారిని దేశం నుంచి బహిష్కరించే అవకాశం ఉందని రూబియో హెచ్చరించారు. వీసా పొందిన తర్వాత కూడా నిఘా ఉంటుందని, పరిస్థితులు మారితే చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. చట్టవిరుద్ధంగా పనిచేయడం, ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం వంటి చర్యలను అమెరికా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని రూబియో తెలిపారు.అమెరికాలో 30 రోజులకు మించి ఉండే విదేశీయులందరూ తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలనే నిబంధనను కూడా ట్రంప్ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ విధానాల వల్ల ప్రభుత్వ పర్యవేక్షణ ఎక్కువ అవుతుందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అయితే, ప్రజల భద్రత, జాతీయ భద్రత కోసమే ఈ చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతోంది. అమెరికా సమాజానికి ఉపయోగపడే వ్యక్తులకే వీసా వ్యవస్థ ఉద్దేశించబడిందని, దేశాన్ని నాశనం చేయాలనుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని రూబియో హెచ్చరించారు.

## తండ్రీ కొడుకులను, పవన్ కళ్యాణ్ ను
## నమ్ముకుంటే పోలీసులకు ఇదే గతి పడుతుంది

- మొదటి పేజి తరువాయి

ఆయన మాట్లాడుతూ... తండ్రీ కొడుకులను, పవన్ కళ్యాణ్ ను నమ్ముకుంటే పోలీసులకు ఏ గతి పడుతుందో కళ్లెదుటే కనిపిస్తోందని అన్నారు. హుందాతనం మరచి రెడ్ బుక్ రచయిత లోకేశ్ ను చూసుకుని, అడ్రస్ లేని పవన్ కళ్యాణ్ ను చూసుకుని రెచ్చిపోతే తిప్పలు తప్పవని పోలీసులను హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో అధికారులను వాడుకుని వదిలేయడం సాధారణమని, ఈ విషయాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్పైలు, సీఐలు గమనించాలని సూచించారు. చంద్రబాబు ఎవరినైనా ఎర వేస్తారని, బలి చేస్తారని పేర్ని నాని తీవ్రంగా విమర్శించారు. అధికారి, బంధువు, పోలీసు, కార్యకర్త ఎవరైనా చంద్రబాబుకు ఒకటేనని అన్నారు. కేవలం కార్యకర్తలను మెప్పించడానికి 11 మంది పోలీసులకు శిక్ష విధించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రెడ్ బుక్ చూసో, లోకేశ్ మాటలు వినో, చంద్రబాబు ఆదేశాలనో పాటించి కొందరు పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. దొంగ కేసులు పెట్టడం, కొట్టడం, తిట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని, కాబట్టి అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

## ఇది మంగళగిరి ప్రజల
## మూడు దశాబ్దాల కల...

పెన్ పవర్ డెస్క్:మంగళగిరి సమీపంలోని చినకాకాని వద్ద వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు శంకుస్థాపన చేశారు. కూటమి నేతలతో కలిసి భూమిపూజ నిర్వహించిన అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం, కల్చరల్, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ కూడా పాల్గొన్నారు. దీనిపై నారా లోకేశ్ సోషల్ మీడియాలో స్పందించారు. "మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కల వంద పడకల ఆసుపత్రి. ఏడాదిలోగా ఆ కలను నెరవేరుస్తామని చెప్పాను. ఇప్పుడు మాట నిలుపుకుంటున్నాను. ఇవాళ 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్నాను. 1984లో స్వర్గీయ అన్న ఎన్టీఆర్ గారు వైవీసీ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకం వద్ద సెల్ఫీ దిగాను. మంగళగిరి పట్టణంలో 40 ఏళ్ల క్రితం 30 పడకల ఆసుపత్రికి అన్న ఎన్టీఆర్ గారు శంకుస్థాపన చేశారు. 40 ఏళ్ల తర్వాత 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి నేను శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు.

## ఏపీలో పలువురు ఐఏఎస్
## అధికారుల బదిలీలు

- మొదటి పేజి తరువాయి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌గా ముత్యాలరాజును నియమించారు. రైతు బజార్ల సీఈవోగా కె.మాధవీలతను, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ కార్యదర్శిగా గౌతమిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయుష్ డైరెక్టర్‌గా దినేష్ కుమార్, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నీలకంఠారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## జనగామ జిల్లాలో వర్ష బీభత్సం.. ఈదురు
## గాలులు.. భారీ వడగండ్ల వాన

- మొదటి పేజి తరువాయి

సిత్యా తండాలో రాళ్ళ వర్షం కురిసింది. కుమ్రంభీమ్ జిల్లా కాగజ్‌నగర్?లో కూడా వడగండ్ల వాన కురిసింది. భారీ వర్షం కురవడంతో రోడ్లు జలమయం కావడం గమనార్హం. అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి, కూరగాయలపై ప్రభావం చూపుతుందని రైతులు కలవరపడుతున్నారు.వాతావరణ శాఖ పలు జిల్లాలకు వర్ష సూచన చేసింది. బంగాళాఖాతంలో ద్రోణి కొనసాగుతున్న కారణంగా క్యూమిలో నింబస్ మేఘాల వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది.ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో ఈరోజు అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు(ఏప్రిల్ 14, 2025) ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వర్షాల గురించి అప్డేట్ ఇచ్చింది.

## తజకిస్థాన్, మయన్మార్ లలో భూకంపం

- మొదటి పేజి తరువాయి

కంపించడంతో జనం భయాందోళనకు గురయ్యారు. ఇళ్లల్లో నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంప కేంద్రాన్ని 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కాగా, మయన్మార్‌లో నేడు మరోసారి భూకంపం సంభవించింది. ఇక్కడి మీక్తిలియా ప్రాంతంలో 5.5 తీవ్రతతో భూ ప్రకంపనలు వచ్చాయని అధికారులు తెలిపారు.

## కష్టకాలంలో సహకరించిన ప్రధాని
## మోదీకి, పీఎంవోకు కృతజ్ఞతలు

- మొదటి పేజి తరువాయి

కార్యాలయం సమన్వయంతో అందించిన సహాయం కష్ట సమయంలో ఎంతో భరోసానిచ్చిందని పేర్కొన్నారు.ఉత్తరాంధ్ర గిరిజన ప్రాంతంలో 'అడవి తల్లి బాట' కార్యక్రమంలో పాల్గొని, ఎన్డీయే ప్రభుత్వం తీసుకువచ్చిన అభివృద్ధి పథకాలను ప్రారంభిస్తుండగా ఈ బాధాకరమైన వార్త తనకు అందిందని పవన్ కల్యాణ్ తెలిపారు. తన కుమారుడికి, ప్రమాదంలో చిక్కుకున్న ఇతర పిల్లలకు సకాలంలో సహాయం అందించడం ద్వారా తన కుటుంబానికి ఎంతో ధైర్యం, ఉపశమనం లభించిందని అన్నారు.

"ప్రత్యేకంగా బలహీన గిరిజన సమూహాల జీవితాలను మెరుగుపరచడానికి మీకున్న దార్శనిక నిబద్ధతకు అడవి తల్లి బాట నిదర్శనం. ఈ వర్గాల అవసరాలను పరిష్కరించడానికి మీరు తీసుకున్న అనేక చర్యలలో ఇది ఒకటి. వారి జీవితాలను మార్చేందుకు మీరు చేస్తున్న విస్తృత ప్రయత్నాలలో ఇది కీలకమైన భాగం. పీఎం జన్ మన్, పీఎం జీఎస్ వై, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ సహాయంతో, ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 1,069 కిలోమీటర్ల మేర రోడ్లను రూ.1,005 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. ఇది 601 బలహీన గిరిజన సమూహాల ఆవాసాల్లో కనెక్టివిటీ సమస్యలను పరిష్కరిస్తుంది. ఈ ప్రాజెక్ట్ గిరిజన ప్రాంతాల్లో రవాణాను మెరుగుపరుస్తుంది, పర్యాటకానికి మద్దతు ఇస్తుంది, సకాలంలో వైద్య సహాయం అందిస్తుంది, ముఖ్యంగా ఈ ప్రాంత ప్రజలు ఎప్పటినుంచో ఎదుర్కొంటున్న 'డోలీ' కష్టాలకు ముగింపు పలుకుతుంది" అని ప్రధాని మోదీని కొనియాడారు. ఈ క్లిష్ట సమయంలో తన కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని ఇచ్చినందుకు మరోసారి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

# అశ్వవాహనంపై శ్రీ కోదండరామస్వామి దర్శనం



**పెన్ పవర్ ఒంటిమిట్ట ఏప్రిల్ 13 :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. వాహనసేవ ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి అశ్వవాహనం అధిష్టించి భక్తులకు కల్కి స్వరూపాన్ని ప్రకటిస్తున్నారు. తన నామ సంకీర్తనతో కలిదోషాలకు దూరంగా ఉండమని ప్రబోధిస్తున్నారు. వాహన సేవలో డిప్యూటీ ఈవో శ్రీ నటేష్ బాబు, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పెన్ పవర్

వై.ఎస్.ఆర్. కడప

అన్నమయ్య జిల్లా


## జీవితాన్ని సంకీర్తనగా మలుచుకున్న

# భాగ్యశాలి గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్

### సంకీర్తనల స్వరకల్పనను ఆధ్యాత్మిక యజ్ఞంలా భావించారు

### ఫలాపేక్ష రహితంగా ఆయన పని చేశారు

### యువతరం ఆయన జీవితం నుంచి స్ఫూర్తిని పొందాలి

### భారత గౌరవ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు

### తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్‌కు నివాళులు



**పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 13 :** తిరుపతిలో సంకీర్తనలను స్వరపరచడాన్ని ఓ వృత్తిగా గాక, జీవితాన్నే సంకీర్తనగా మలచుకుని, శ్రీ వారి సేవలో జీవితాన్ని ధన్యం చేసుకున్న భాగ్యశాలి శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ అని భారత గౌరవ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగిన గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని నివాళులర్పించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ "సంపదను చాలా మంది రూపాయల్లో కొలిస్తే, బాలకృష్ణ ప్రసాద్ స్వరాల్లో కొలుచుకున్నారు. అన్నమయ్య సంకీర్తనా ప్రాజెక్టు ద్వారా శ్రీ వారి ఆస్థాన గాయకుడిగా నియమితులై, స్వామివారి సేవలో జీవితాన్ని ధన్యం చేసుకున్నారు." అని చెప్పారు. తెలుగునాట వారి ముఖపరిచయం లేని వ్యక్తులు ఉన్నారేమో గానీ, వారి గాత్ర పరిచయం లేనివారు లేరనటం అతిశయోక్తి కాదన్నారు. తిరుమల శ్రీనివాసుని కృపతో 16 ఏళ్ళ వయసులోనే అన్నమయ్య సంకీర్తనా స్వర యజ్ఞాన్ని బాలకృష్ణ ప్రసాద్ ప్రారంభించారని గుర్తు చేశారు. ఓ ఆధ్యాత్మిక యజ్ఞంలా అన్నమయ్య కీర్తనల స్వర రచనను వారు ముందుకు తీసుకుపోయిన తీరు ఆదర్శనీయమైనది అన్నారు. "గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ గళంలో

తరువాయి 4లో..

## టిటిడి గోశాలలో గోవులు మృతి అసత్యం..

# అసత్య ప్రచారాలు మానుకోండి..

### టిటిడి ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు



**పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 13 :** టిటిడి గోశాలలో ఇటీవల 100 గోవులు మృతి చెందాయంటూ టిటిడి మాజీ ఛైర్మన్ చేసిన వ్యాఖ్యలు కుట్రపూరితంగా ఉన్నాయని టిటిడి ఛైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు మాట్లాడారు. ఆదివారం టిటిడి గోశాలలో గోవులను, గోవుల ఆవాసాలను, వాటికి రోజువారీ అందించే దాణాను మీడియా, అధికారులతో కలసి పరిశీలించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. టిటిడి గోశాల



నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని, గోవులను తల్లిలా భావించి ఎప్పటికప్పుడు దాణా, అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఎక్కడో మృతి చెందిన గోవుల ఫోటోలను, గత పాలనలో గోశాలలో మరణించిన గోవుల ఫోటోలను చూపి అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత పాలనలో మరణించిన గోవుల ఫోటోలను, తేదీలను మార్చి ప్రస్తుతం చనిపోయినట్లు చూపిన ఫోటోలను మీడియాకు చూపించారు. టిటిడి ఛైర్మన్‌గా కరుణాకర్ రెడ్డి ఉండగా గోవులకు కాలం చెల్లిన మందులు, పురుగులు పడ్డ దాణా పంపిణీ చేసినట్లు వారి పాలనలో విజిలెన్స్ నివేదికే స్పష్టం చేస్తోందన్నారు. ఈ సందర్భంగా అప్పటి విజిలెన్స్ నివేదికను, అందుకు సంబంధించిన ఫోటోలను మీడియాకు చూపించారు. ప్రతీ రోజూ అసత్య ఆరోపణలు, పచ్చి అపద్దాలతో

తరువాయి 4లో..

# రోగులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి

### ఆసుపత్రికి అవసరమైన పరికరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వండి

### ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్





**నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్ 13 :** ప్రతిరోజు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు దాదాపు 1500 రోగులు వస్తుంటారని వచ్చే రోగులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఆదివారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు సి.శ్రీదేవి, శ్రీరామమూర్తి, శివశంకర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఏ. శ్రీదేవి, జిజిహెచ్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి, డిఎంహెచ్ఓ డా.వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు దాదాపు 1500 రోగులు వస్తుంటారని వచ్చే రోగులకు అన్ని మౌలిక సదుపాయాలు ఉండడంతో పాటు డాక్టర్లు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, త్రాగునీటి వసతి, మౌలిక సదుపాయాల మరమ్మతులను హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ నిధుల నుండి వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. ఇప్పటినుండి ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించి అవసరమైన పరికరాలు, వైద్య సిబ్బంది తదితర అంశాలపై చర్చించి అవసరమైన నిధులు సమకూర్చుకొని అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని మంత్రి జిజిహెచ్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో డాక్టర్లు అందరూ కూడా అందుబాటులో ఉండి పేదవారి పట్ల మానవతా దృక్పథంతో మంచి వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆసుపత్రికి ఒక గుర్తింపు తీసుకురావాలన్నారు. ఆసుపత్రిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొంటూ కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలన్నారు. రహదారి ప్రమాదాలకు గురైన క్షతగాత్రులకు ఇతర అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి అందించేందుకు క్రిటికల్ కేర్ యూనిట్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని మంత్రి ఆదేశించారు. గతంలో పెండింగ్ ఉన్న ఎలక్ట్రికల్, ప్లంబరింగ్ స్టేషనరీ, సిసి కెమెరా తదితర బిల్లులకు సంబంధించిన నిధులను ఆమోదించామన్నారు. ఆసుపత్రికి అవసరమైన తాగునీటి సౌకర్యాన్ని అమృత స్కీం కింద ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పేద ప్రజలు వైద్యం కోసం ఎంతో నమ్మకంతో వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో ఉన్న వసతులను మరింత పటిష్టం చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. హాస్పటల్లో పారిశుధ్య లోపం, టాయిలెట్ల నిర్వహణ లేకపోవడం, త్రాగునీటి సమస్య, పరికరాలు లేకపోవడం, పరికరాలు ఉంటే టెక్నీషియన్స్ లేకపోవడం తదితర లోపాలు ఉన్నట్లు హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు కమిటీ దృష్టికి తీసుకొచ్చారని ... వీటన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో సమకూర్చాలని జిజిహెచ్ సూపరింటెండెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. సిఎస్ఆర్ నిధులతో ఆర్వో ప్లాంట్, సీసీ కెమెరాల ఏర్పాటు చేయిస్తామని ప్రొసీజర్ ప్రకారం ఎస్టిమేట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి దస్త్రాలు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీ, డయాలసిస్, ఎక్స్ రే ఎక్విప్మెంట్, బ్లడ్ బ్యాంకులో రిఫ్రిజిరేటర్లు, 24 గంటల ల్యాబ్, బయో కెమిస్ట్రీ కి సంబంధించిన డిస్టిల్ వాటర్, తదితర రోగులకు అవసరమైన వైద్య పరికరాలను హాస్పిటల్ డెవలప్మెంట్ నిధుల నుండి వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హాస్పిటల్ కు అన్ని విధాల సపోర్టు ఇచ్చి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రిలో నీటి కొరత లేకుండా మున్సిపల్ అధికారుల సమన్వయంతో ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యాలయం నమూనా చిత్రం..

### ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరణ





**కడప పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 13 :** కడప నగరంలో నిర్మిస్తున్న కడప జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నమూనా చిత్రాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. పార్టీ భవిష్యత్ తరాలకు సేవలందించే విధంగా భవన నిర్మాణ శైలిని రూపొందించినందుకు చంద్రబాబు నాయుడు అభినందించారు. అలాగే కడప నగరంలో మే 27, 28, 29వ తేదీల్లో జరగనున్న తెలుగుదేశం మహానాడు కార్యక్రమానికి సంబంధించిన పనులపై కార్యాచరణ పై జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులతో చర్చించడం జరిగింది. ఈసారి జరిగే మహానాడు అత్యద్భుతంగా జరగాలని దానికి కావాల్సిన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, పొలిట్ బ్యూరో సభ్యులు జిల్లా అధ్యక్షులు రెడ్డప్పగారి శ్రీనివాస్ రెడ్డి, కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, జమ్మలమడుగు ఇంచార్జ్ భూపేష్ రెడ్డి, బద్వేల్ ఇంచార్జ్ రితేష్ రెడ్డి, టిడిపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## హైవేపై ప్రమాదం..

### మహిళా కమిషన్ సభ్యురాలికి గాయాలు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 13 :** తొట్టంబేడు పరిధి పొయ్య గ్రామం సమీపంలో ఆదివారం బైకు-స్కార్పియో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైకు మీద ప్రయాణిస్తున్న వ్యక్తితో పాటూ స్కార్పియోలో ప్రయాణిస్తున్న ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యురాలు రూకియా బేగంకు గాయాలయ్యాయి. వారిని శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్కు తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## కాళీయమర్దనాలంకారంలో శ్రీకోదండరామస్వామి కటాక్షం





**ఒంటిమిట్ట, పెన్ పవర్, రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 13 :** శ్రీ కోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన ఆదివారం ఉదయం కాళీయమర్దనాలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు స్వామివారి వాహన సేవ వైభవంగా జరిగింది. భజన బృందాలు భజనలు, కోలాటాలు ఆడుతుండగా స్వామివారు పురవీధుల్లో విహరించారు. వాహనసేవ అనంతరం ఉదయం 11 గంటలకు స్నపన తిరుమంజనం వేడుకగా ప్రారంభమైంది. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనంతో శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరాములవారి ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేశారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు దర్శనం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, భక్తులు పాల్గొన్నారు.

**ఏప్రిల్ 14న చక్రస్నానం :**

శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు చక్రస్నానం వైభవంగా జరుగనుంది. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయ.

**ఏప్రిల్ 15న పుష్పయాగం :**

శ్రీ కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.

# శ్రీకాళహస్తిలో తప్పిన పెను ప్రమాదం



**శ్రీ కాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 13 :** శ్రీకాళహస్తిలోని శ్రీరామ నగర్ కాలనీకి వెళ్లే దారిలో ఆదివారం చెట్టు విరిగిపడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెట్టు విద్యుత్ స్తంభాలపై పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నిత్యం జన సంచారం ఉండే ఈ ప్రాంతంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## టౌన్ పోలీసులు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




**శ్రీ కాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 13 :** శ్రీ కాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద సీఐ వెంకటేశులు ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. వేసవి కాలం కావడంతో ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం టౌన్ పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రజల కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఇంటర్ పరీక్షల్లో టీటీడీ కళాశాలల విద్యార్థుల విశేష ప్రతిభ

**తిరుపతి పెన్ పవర్ ఏప్రిల్ 13 :** టీటీడీ ఆధ్వర్యంలోని జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు శనివారం విడుదలైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో 93% ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 623 మంది విద్యార్థినులు పరీక్షలు వ్రాయగా, 570 మంది విజయం సాధించారు. ఇందులో 380 మంది డిస్టెన్షన్, 142 మంది ప్రథమ శ్రేణి, 42 మంది ద్వితీయ శ్రేణి ,13 మంది తృతీయ శ్రేణి సాధించారు. అదేవిధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 717 మంది విద్యార్థినులు పరీక్షలు వ్రాయగా 571 మంది (80%) విజయం సాధించారు. ఇందులో 328 మంది డిస్టెన్షన్, 149 మంది ప్రథమ, 68 మంది ద్వితీయ, 16 మంది తృతీయ శ్రేణి పొందారు. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో 84.50% ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలలో శ్రీ వెంకట చరణ్ అనే విద్యార్థి 977 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. కళాశాలలో 355 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 300 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఏ గ్రేడ్ 148, బి గ్రేడ్ 101, సీ గ్రేడ్ 34, డి గ్రేడ్ 17 మంది పొందారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో శ్రీ లక్ష్మీ చరణ్ అనే విద్యార్థి 461 (98.08%) మార్కులతో కాలేజీ టాపర్ గా నిలిచారు. అదేవిధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు 531 మంది విద్యార్థులు వ్రాయగా, 309 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఏ గ్రేడ్ - 132, బి గ్రేడ్ -108, సీ గ్రేడ్- 48, డి గ్రేడ్- 28 మంది విద్యార్థులు పొందారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఈవో జె.శ్యామలరావు, జేఈఓ వి.వీరబ్రహ్మం ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

## వక్ఫ్ బోర్డ్ పోరాటాలు ఆగవు.. సంయుక్త మసీద్ కమిటీ



**పెన్ పవర్ ధర్మవరం ఏప్రిల్ 13 :** వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రద్దు చేసేంతవరకు మా పోరాటాలు ఆగవని పట్టణంలోని మసీదు కమిటీ తెలిపారు. ఈ సందర్భంగా రెండవ రోజు పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన దీక్షను చేపట్టారు. ఈ కార్యక్రమం జామియా మసీద్ అధ్యక్షతన జరిగింది. తదుపరి హిందూ ముస్లిం సోదరులతో నిరాహార దీక్ష కొనసాగడం జరిగింది. ఈ దీక్షలు 20వ తేదీ వరకు కొనసాగిస్తామని తెలిపారు. కొత్త సవరణ చట్టం వెనక్కి తీసుకునేంతవరకు పలు నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో పలు సంఘాల వారు సంఘీభావాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 100% ఉత్తీర్ణత సాధించిన ఏపీ గిరిజన సంక్షేమ కళాశాల



**శ్రీ కాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 13 :** శ్రీకాళహస్తి రాజీవ్ నగర్ కాలనీలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల ప్రతిభ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 100% సాధించారని కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు తెలిపారు. ఎస్టీ గురుకుల కళాశాలలో రాష్ట్రస్థాయి ర్యాంకులను తమ కళాశాల సాధించిందని తెలిపారు. తమ విద్యార్థిని భవాని భాయి 982 మార్కులతో గిరిజన విభాగంలో ఫస్ట్ ర్యాంకర్‌గా నిలిచిందన్నారు.

## బీజేపి నాయకుడు, నందలూరు రైల్వే ఉద్యమ నాయకుడు మస్తానయ్య ఆకస్మిక మృతి...



**నందలూరు పెన్ పవర్ ఏప్రిల్ 13 :** మస్తానయ్య ఒక పార్టీ నాయకుడు అనడం కంటే ప్రాంతీయ అభిమానం మెండుగా ఉన్న వ్యక్తి అని చెప్పాలి. తన ఊరు, తన ప్రాతం అభివృద్ధి చెందాలి అని తపన పడే వ్యక్తుల్లో మస్తానయ్య ముందు వరసలో ఉంటారు. తన ఊరు బాగుండాలి అని చాల మంది తపన పడుతుంటారు. అయితే తపన పడటం వేరు. ఊరు బాగుండాలి అనే తపనకు తగ్గట్లు ఉద్యమించే వ్యక్తిత్వం కూడా మస్తా నయ్య సొంతం అనే చెప్పాలి. ఏది ఏమైనా నందలూరుకు చెందిన మస్తానయ్య నందలూరు అభివృద్ధికి అనేక ఉద్యమాలు చేశారు. ముఖ్యంగా రైల్వే లోకొషెడ్, ఆల్విన్ ఫ్యాక్టరీస్థానంలో పరిశ్రమ ఏర్పాటు చేయాలనీ ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికీ మరువలేనివి. చాలామంది అంటుంటారు... ఊరుబాగుండాలి అని మస్తానయ్యపడే తపన నాయకులకు ఉంటే వారి ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి అని. మస్తానయ్యతో నాకు చాల తక్కువ పరిచయం. కానీ సొంతూరు బాగుండాలి అని ఆయన నిబద్ధతతో చేసిన పోరాటాలు నన్ను ఎంతో ఆకట్టుకున్నాయి. అందువల్ల ఆయన మృతి వార్త నన్ను ఎంతో కలచి వేస్తుంది సయ్యద్ జల్ఫికర్ తీవ్ర దిగ్భ్రాంతికి గురి అయ్యాను అని ఆయన ఓ ప్రకటనలో తెలియజేశారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో ముగిసిన కొట్టాయి ఉత్సవం



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 13 :** శ్రీకాళహస్తీశ్వరాలయంలో పెద్ద కొట్టాయి ఉత్సవం శనివారంతో ముగిసింది. వేసవి ఎండల తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు స్వామి, అమ్మవార్లకు ఈ నెల 6 వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పెద్ద ఉత్సవాన్ని కన్నుల పండువగా జరిపించారు. ప్రతిరోజు స్వామి, అమ్మవార్లను కోట మండపం వద్దకు తీసుకువచ్చి విశేష పూజలు చేశారు. చివరి రోజైన శనివారం స్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిపి, పురవీధులలో ఊరేగించారు.

## బాణాసంచారీ కేంద్రంలో అగ్నిప్రమాదం.. 8 మంది మృతి...

### ప్రభుత్వం అండగా ఉంటుంది : మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 13 :** కోటవురట్ల బాణసంచా తయారీ కేంద్రం అగ్ని ప్రమాదంలో 8మంది మృతి చెందడంపై వైద్య ఆరోగ్య శాఖామంత్రి దిగ్భ్రాంతి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై ఆరా తీసిన మంత్రి సత్యకుమార్ యాదవ్. అనకాపల్లి జిల్లా, కోటవురట్లలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని ఆరుగురు కార్మికులు మృతి చెందడంపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలదించాలని ఆదేశించిన మంత్రి సత్యకుమార్ యాదవ్. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గాయపడిన వారిలో ఆందోళనకరంగా ఉన్న ఇద్దరికి యుద్ధ ప్రాతిపదికన చికిత్స అందించాలని మంత్రి ఆదేశించారు. అన్ని రకాల అత్యవసర వైద్య సేవలు బాధితులకందేలా చూడాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని వైద్యాధికారుల్ని మంత్రి ఆదేశించారు.

## విజయవంతంగా జరిగిన రక్తదాన శిబిరం

### రక్తదానం చేద్దాం ప్రాణదాతలు అవుదాం



**శ్రీ కాళహస్తి. పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 13 :** యువ సమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఏడవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వార్షికోత్సవం సందర్భంగా ఏర్పేడులోని సంత మైదానంలో రుయా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ల సిబ్బంది పర్యవేక్షణలో శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి సంస్థ ప్రతినిధులు ఫౌండర్ డాక్టర్ గానుగ పెంట రమేష్ ,సంస్థ రాష్ట్ర అధ్యక్షులైన తాళిక్కాల్ వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రుయా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్స్ రాహుల్, భరద్వాజ్, కౌన్సిలర్ వాహిని,మరియు సిబ్బంది సంస్థ సభ్యులు వేణు, దినేష్, వాణి,కర్ణ, గురు, సాయి, నవీన్, హర్షా, మరియు సభ్యులు పాల్గొన్నారు.

### యానం "బీచ్ వాలీబాల్" టోర్నమెంట్‌లో

## అనంతపురం జట్టు ఘనవిజయం



**అనంతపురం, పెన్ పవర్ ధర్మవరం ఏప్రిల్ 13 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో ఉమ్మడి అనంతపురం జట్టు విజయం సాధించింది. "ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్" ఆధ్వర్యంలో ఉప్పలగుప్పం మండలం సూరసేన యానాంలో రెండు రోజుల పాటు నిర్వహించిన " బీచ్ వాలీబాల్ టోర్నమెంట్" విజేతలకు ఆదివారం ఉదయం బహుమతి ప్రదానం నిర్వహించారు. టోర్నమెంట్‌లో 13 జిల్లాల పాత్రికేయులజట్లు పోటీలో పాల్గొన్నాయి. శనివారం జరిగిన లీగ్ మ్యాచ్లో వైజాగ్ జట్టుతో 10-20తో ,క్వార్టర్ ఫైనల్‌లో నెల్లూరుతో 7-20 తో విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో పశ్చిమగోదావరితో అనంతపురం తలపడగా 5-20తో అనంతపురం జట్టు ఘన విజయం సాధించింది. ఈ బీచ్ వాలీబాల్ క్రీడలో పాత్రికేయులు కేసాని రామకృష్ణ, నరసింహులు, శిరిగినేని కేశవ, మురళి, రాము, సాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది అన్నారు. వృత్తిపరంగా నిత్యం ఒత్తిడిలో జీవించే జర్నలిస్టుల కోసం ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం విజేతలకు ఎమ్మెల్యే సీల్డ్ ను అందజేశారు.

## టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్దాయనను (పుత్తా నరసింహారెడ్డి) పరామర్శించిన కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి





**హైదరాబాద్ పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 13 :** తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహ రెడ్డిగారు మోకాలి శస్త్ర చికిత్స జరిగిన కోలుకుంటున్న తరుణంలో నేడు స్టార్ హాస్పిటల్ హైదరాబాద్‌లో కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రెడ్డెప్పగారి మాధవి , టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు & జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి, ఆర్.శ్రవణ్ రాజ్ రెడ్డి పరామర్శించడం జరిగింది.

# అసత్య ప్రచారాలు మానుకోండి..





**(3వ పేజీ తరువాయి)** టిటిడి సంస్థ మీద బురద చల్లుతూ రాజకీయ లబ్ది పొందాలని చూస్తే జీరో అవుతారని హెచ్చరించారు. వ్యక్తిగతంగా నా మీద ఏమైనా ఉంటే ఆరోపించుకో కానీ దైవ సంస్థ మీద అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. టిటిడి గోశాలలో గోవుల సహజ మరణాలను ఆయన సొంత రాజకీయాల కోసం వాడుకోవాలని కుట్రలు చేస్తే శ్రీవేంకటేశ్వర స్వామి వారు చూస్తూ ఊరుకోరన్నారు. ఇతర మతాల విశ్వాసాల మీద అసత్య ప్రచారాలను ఇలాగే చేయగలవా అని, హిందువులపై ఎందుకంత ద్వేషమని ఆయన ప్రశ్నించారు. కరుణాకర్ రెడ్డికి దేవుడు అంటే భయం లేదు, భక్తి లేకనే రోజూ ఏదో ఒక విధంగా అపద్దాలను మాట్లాడుతున్నార న్నారు. టిటిడి సంస్థపై ఏదైనా నిజాలు చెబితే సరిదిద్దుకుంటామని కానీ బురద చల్లితే ఊరుకోమన్నారు. నేను ఛైర్మన్ అయ్యాక గత పాలనలో జరిగిన ఇంజనీరింగ్ పనులపై ఆరా తీస్తుంటే అడుగడుగునా కమిషన్ల భాగోతమమేనని, కాంట్రాక్టర్లు అందరూ వచ్చి మేము కమీషన్లు ఇచ్చాం, మా సంగతేంటని అడుగుతున్నారని, అయితే ఆయన టిటిడి కమీషన్ల ఛైర్మన్‌గా కరుణాకర్ రెడ్డి అపకీర్తి మూటగట్టుకున్నారని విమర్శించారు. తాను ఛైర్మన్ అయ్యాక ఒక రూపాయి కూడా అవినీతి మరక లేకుండా ఛైర్మన్‌గా సేవలు అందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిటిడి బోర్డు సభ్యులు జీ.భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడారు.

### జీవితాన్ని సంకీర్తనగా మలుచుకున్న

## భాగ్యశాలి గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్





**(3వ పేజీ తరువాయి)** తడిసిన ప్రతి పదమూ, భగవంతుని పాదాలకు స్వర పద్మాలుగా మారుతాయి. ఆ కీర్తనలను విన్న మనసులు ఆధ్యాత్మిక రసానుభూతికి లోనవుతాయి. శ్రీ బాలకృష్ణ ప్రసాద్ గారు కూడా ఇదే మార్గంలో ముందుకు సాగారు."వారు జీవితంలో ఏదీ కోరుకోలేదు. సంగీతం పట్ల శ్రద్ధ, శ్రీనివాసుని పట్ల భక్తి ప్రపత్తులు, అన్నమయ్య పట్ల అచంచల గౌరవంతో శ్రీనివాసుని సంకీర్తనా యజ్ఞాన్ని జీవిత పర్యంతం కొనసాగించారు. పేరు ప్రతిష్టల గురించి గానీ, ఇతర అంశాల గురించి గానీ ఆలోచించలేదు. తన పనిని తాను పూర్తి చేసుకుంటూ వెళ్ళారు. దీన్ని ఈతరం యువత ప్రేరణగా తీసుకోవాలి." అని సూచించారు. ఇటీవల సమాజంలో భక్తి పేరిట కొన్ని అనవసర నమ్మకాలు పెరిగిపోతున్నాయన్నారు. ప్రతి చిన్న విషయానికి తిథులు చూసుకుంటున్నారంటూ మన పెద్దలు సూచించిన మార్గంలో నడవటంలో తప్పు లేదని, అదే సమయంలో మూఢంగా నమ్మకాలు పెంచుకోవడం మంచిది కాదని అన్నారు. "తిథుల కంటే విధులు ముఖ్యం" అన్నారు.

## మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్ అన్నకు ఘన సన్మానం





**కడప పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 13 :** కడప నగరంలోని మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నివాస కార్యాలయం నందు పొలిటికల్ అడ్వైజరి కమిటీ సభ్యులుగా నియమితులైన సందర్భంగా మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషాని సన్మానించిన జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, దూదేకుల సంఘ నాయకులు అబ్దుల్ సుభాన్, ఓ రసూల్ గారు, సుంకేసుల బాదుల్లా, కుళ్లాయప్ప, ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అజ్మతుల్లా ఖాన్, పెద్దిరెడ్డి రఘునాథరెడ్డి, రహీం, సలీం సాహెబ్, మాస్టర్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

## నాయుడుపేట శ్రీ పోలేరమ్మ జాతర కమిటీ నియామకం

### అధ్యక్షులుగా నానబాల సుబ్బారావు



**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 13 :** నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర కమిటీని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యంలు ప్రకటించారు. నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నాన బాల సుబ్బారావు అధ్యక్షులుగా మరో 5 మందిని కమిటీ సభ్యులను ప్రకటించారు. శనివారం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో జరిగిన కుటుంబ సాధికార సభ్యుల సమావేశం సందర్భంగా మే నెల మొదటి వారంలో నాయుడుపేటలో జరుగునున్న శ్రీ పోలేరమ్మ జాతర కమిటీని వారు ప్రకటిం చారు. ఈ సందర్భంగా నానబాల సుబ్బారావు జాతర నిర్వహణకు తన వంతు సహకారంగా ఒక లక్ష రూపాయల విరాళాన్ని ప్రకటించారు.అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ 50 వేల రూపాయల విరాళాన్ని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పసల గంగా ప్రసాద్,టి సుధాకర్ రెడ్డి, గాది రెడ్డి గోపి,బి ఎల్ శ్రీనివాసులు,వినుకొండ ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

## చీకటిలో గొట్టాం గ్రామం.. త్రాగు నీళ్లకి ఇబ్బంది పడుతున్న ప్రజలు



**దొరవారి సత్రం, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 13 :** తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండలం పూలతోట గ్రామ సచివాలయం పరిధిలో ఉన్నటువంటి అనే గొట్టాం గ్రామంలో ప్రజలు చాలా ఆందోళనకరంగా బాధపడుతున్నారు రాత్రి 7:00 గంటల నుండి తెల్లవారి దాకా నైటు వీధుల్లో రావాలంటే మా ఊరి చుట్టుపక్కల పిచ్చి చెట్టులతో కూడిన ఊరు చాలా ఇబ్బంది పడుతున్నాము వీధిలైట్లను గత రెండు మూడు సంవత్సరాలు నుంచి వేయించడం లేదని ప్రజల ఆవేదన మరియు నీళ్లకి కూడా చాలా ఇబ్బంది పడుతున్నాము మాకు వాటర్ లైన్ కూడా లేదు పంచాయతీ కార్యదర్శి మాత్రం మేము గ్రామంలో ఇంటి పన్ను కట్టకపోతే మీకు పెనాల్టీ పడుతుందని చెప్పి ఇంటి పన్ను వసూలు చేస్తున్నాడు కానీ మా గ్రామంలో వీధిలైట్లు మరియు వాటర్ లైన్ లేదనేసి మేము చెపుతున్నాము గత రెండు మూడు నెలలుగా చెప్తూనే ఉన్నాం కానీ పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదు ఇంటి పన్ను మాత్రం పెనాల్టీ పడుతుంది అని చెప్పి వసూలు చేస్తున్నాడు మా గ్రామంలో అతను మాకు ఎటువంటి సహాయం లేదు నాయకులు కూడా పట్టించుకోవడం లేదు దయవుంచి దీని సంబంధించిన అధికారులను పరిశోధన చేయవలసిందిగా కోరుతున్నారు.

# బిజెపి మస్తానయ్య .. ఇక లేరు...





**నందలూరు పెన్ పెపర్ ఏప్రిల్ 13 :** నాగిరెడ్డిపల్లి నివాసి బిజెపి మస్తనయ్య స్వర్గస్తులయ్యారు ఆయన ఆత్మకు శాంతి కలిగించాలని పూలమాల వేసి నివాళులర్పించిన వైఎస్ఆర్సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మరియు రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి వారితో త్రినాథ్, గుండు మల్లిఖార్జున రెడ్డి, మధు యాదవ్, మధు రాజు, గడ్డం సుబ్బిరెడ్డి తదితరలు ఉన్నారు.

## విశాఖపట్నంలో వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి సామూహిక వ్రతం

**తిరుపతి పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 13 :** టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నంలో శ్రీ వేంకటేశ్వర స్వామి సామూహిక వ్రతం ఘనంగా జరిగింది. విశాఖపట్నం ఎంవిపి కాలనీలోని టిటిడి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీ వేంకటేశ్వర స్వామి సామూహిక వ్రతం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా సుమారు 1000 మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ వ్రతాన్ని జిల్లా ధార్మిక కమిటీ మరియు దాతల సహకారంతో విజయవంతంగా నిర్వహించారు. భక్తులకు టిటిడి ద్వారా ఉచితంగా పూజా సామగ్రి, రెండు రకాల ప్రసాదాలు భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కూచిపూడి, భరత నాట్యం, సంకీర్తనల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు కూడా భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ శ్రీనివాస వ్రతం విశాఖ నగర ప్రజల ఆధ్యాత్మిక చైతన్యాన్ని మరింత పెంపొందించింది. టిటిడి వేద పండితులు వేద పారాయణం నిర్వహించారు. భక్తులకు వేదాశీర్వచనాలు ఇచ్చారు. కార్యక్రమ విజయవంతానికి జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు, అన్నమయ్య సేవా సంస్థ సభ్యులు, వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంస్థలు మరియు సభ్యులు, శ్రీవారి సేవకులు తనవంతు సేవ అందించి ఎంతో సహకరిం చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ సూపరింటెండెంట్ శ్రీ కాంతికుమార్, జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ శ్రీ సత్యనారాయణ, జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కళా భూషణ అవార్డు .. అయోధ్య రామ అవార్డు...





**ధర్మవరం పెన్ పవర్ ఏప్రిల్ 14 :** హైదరాబాద్ లోని రవీంద్రభారతి నందు సిరి ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించినటువంటి ఆల్ ఇండియా డ్యాన్స్ అండ్ మ్యూజిక్ ఫెస్ట్-2025 కార్యక్రమంలో ధర్మవరం పట్టణంకు చెందినటువంటి మానస నృత్య కళాకేంద్రం వారి శిష్య బృందం పాల్గొన్నారు. గురువు ఆర్.మానస ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎం.పి.ఆర్. కృష్ణయ్య, దైవేజ్ఞ శర్మ చేతుల మీదుగా గురువు మానసకి "కళాభూషణ అవార్డు" "అయోధ్య రామ అవార్డును" ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం వారి శిష్య బృందానికి బాల గోపాలకృష్ణ అవార్డు ఇవ్వడం జరిగింది.

## సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవు

### - డి.ఎస్.పి హేమంత్ కుమార్



**పెన్ పవర్ ధర్మవరం ఏప్రిల్ 13 :** సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవు అని డిఎస్పి హేమంత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలైన వాట్స్ అప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, టెలిగ్రామ్, యూట్యూబ్ ,ఎక్స్ (ట్విట్టర్) ఇతర సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచేలా అనుచిత, అనైతిక అవమానకర రీతిలో పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు. రాజకీయంగాను, కులాల మధ్య విద్వేషాలు సృష్టించే విధంగా, రెచ్చగొట్టే వాక్యలు, దుష్ప్రచారం ,మతపరమైన సున్నిత అంశాల్లో వదంతులు, అవాస్తవాలు ప్రచారం చేస్తూ ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధంగా పోస్టులు పెట్టే వారిపై చట్ట ప్రకారం తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. నిజా నిజాలు తెలుసుకోకుండా వివాదాస్పద విషయాలు లేదా తప్పుదారి పట్టించే ఫేక్ న్యూస్ పెట్టడం, షేర్ చేయడం, అనుచిత, అసభ్య పోస్టులు పెట్టడానికి ప్రోత్సహించడం, సహకరించడం వంటివి కూడా చట్టరీత్యా నేరం అవుతుందని తెలిపారు. ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిపై అనుక్షణం పోలీస్ నిగా ఉంటుందని వారు తెలిపారు. ఈ తరహా నేరాలకు పాల్పడే వారిని వెంటనే గుర్తించి, అట్టి వారిపై కేసులు కూడా తప్పక నమోదు చేస్తామని తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పొన్నుబోయిన చెంచురామయ్య 22వ వర్ధంతి

**ఉదయగిరి పెన్ పవర్ - ఏప్రిల్ 13 :** గండిపాలెం రిజర్వాయర్ సాధనకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పొన్నుబోయిన చెంచురామయ్య 22వ వర్ధంతి కార్యక్రమం ఆయన కుమారుడు మాజీ జడ్పీ చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి పట్టణ పరిధిలోని చంచల బాబు గెస్ట్ హౌస్ నందు ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ శ్రీమతి ప్రవీణ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రియతమ నాయకులు దివంగత నేత మాజీ ఎమ్మెల్యే పొన్నుబోయిన చెంచురామయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విశాలమైన భూభాగం కలిగినప్పటికీ తాగు త్రాగునీరు లేక అలమటిస్తున్నారు. గండిపాలెం రిజర్వాయర్, నక్కల గండి, బసి నేనిపల్లి రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని పట్టుబట్టి ఆ కాలంలోనే ఇరిగేషన్ ప్రాజెక్టులో సాధించిన నేతగా రైతన్నల గుండెల్లో స్థిరంగా నిలిచి ఉన్నారని, అటువంటి నేత వర్ధంతిని జరుపుకోవడం, ఆ కార్యక్రమంలో పాల్గొనడం, ఈ సభలో ఆయన కుమారుడు ఉండడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన విగ్రహాలను గండిపాలెం రిజర్వాయర్ ప్రాజెక్టు వద్ద మరియు ఉదయగిరి లోని ట్యాంకుబండ పై ఏర్పాటు చేసుకొని ఆయనను స్మరించుకోవాలన్నారు.

## ప్రతిభావంతులలో "ఆచార్య మూల"కు పట్టం : డీకే చదువుల బాబు



**పెన్ పవర్, కడప రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 13 :** సాహిత్యం,కళారంగాల్లో ప్రతిభను కనపరుస్తున్న సాహిత్యకారులను, కళాకారులను గుర్తించి మా సంస్థల ఆధ్వర్యంలో సత్కరించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చదువుల సాహిత్య కళావేదిక, బాల సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు డీకే చదువుల బాబు అన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రొద్దుటూరు శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యుల శాఖ గ్రంథాలయంలో పై సంస్థల ఆధ్వర్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేంపల్లి షరీఫ్ రచించిన 'చారల పిల్లి: పుస్తక పరిచయం, నాటక రంగానికి నిరంతరం సేవలందిస్తున్న ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, కొత్తపల్లి శీను, కంభం పాములేటిలకు :నటభూషణ 'పురస్కార ప్రధానం, గద్వాల సోమన్న రచించిన'పూల సజ్జ' పుస్తకావిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. సభాధ్యక్షులుగా వ్యవహరించిన డీకే చదువుల బాబు మాట్లాడుతూ ఏ రంగంలోనైనా తన జీవితాన్నంత ధారబోసి అహోరాత్రాలు శ్రమించి ప్రతిభను చాటుతున్న వారికి తగిన విధంగా గుర్తింపు లభించినప్పుడే వారి శ్రమ చరితార్థం అవుతుందని అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దాదా హయత్ ప్రసంగిస్తూ వేంపల్లి షరీఫ్ లాంటి యువ కథా రచయితలను ప్రోత్సాహించడం, ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, కొత్తపల్లి శీను, కంభం పాములేటి వంటి రంగస్థల కళాకారులకు నట భూషణ బిరుదు ప్రధానం చేయడం, గద్వాల సోమన్న పూలసజ్జ పుస్తకాన్ని ఆవిష్కరణ చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. విశిష్ట అతిథి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ నాటక రంగంలోని నిష్ణాతులైన వారికి 'నటభూషణ 'బిరుదు ప్రదానం చేసిన డీకే చదువుల బాబును అభినందించారు.అతిథులుగా విచ్చేసిన జింకా సుబ్రహ్మణ్యం, సివి సురేష్, డాక్టర్ తవ్వా వెంకటయ్య, వంశీలు మాట్లాడుతూ నూతన దృక్పథంతో భిన్నమైన కథలను రాస్తూ యువ కథా రచయితగా వేంపల్లి షరీఫ్ సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారని, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి సాహిత్య, సాంస్కృతిక,నాటక రంగాల్లో చేసిన కృషి ప్రశంసనీయమని, అలాగే కొత్తపల్లి శీను కంభం పాములేటి కళా రంగానికి ఎనలేని సేవలు చేస్తున్నారని,అలాంటి వారి సేవలను గుర్తించి డీకే చదువుల బాబు తమ సంస్థల ద్వారా వారిని సత్కరించడం అభినందనీయమన్నారు. మహమ్మద్ భాషా నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, కొత్తపల్లి శీను,కంభం పాములేటిలను 'నటభూషణ' బిరుదంతో,అలాగే పుస్తక రచయితలు వేంపల్లి షరీఫ్ గద్వాల సోమన్నలను ఘనంగా సత్కరించారు. సత్కార గ్రహీతలు స్పందిస్తూ తమకు జరిగిన సన్మానాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కవులు, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

## మత సామరస్యం,పరమత సహనం నేటి ఆవశ్య కత

### రాజ్య సభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి





**పెన్ పవర్, విజయవాడ ఏప్రిల్ 13 :** మతోన్మాదం మానవాళికి క్యాన్సర్ లా పట్టుకుందని,దీనిని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం వుందని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి అన్నారు. ఆదివారం విజయవాడ లో,సిద్దార్థ ఆడిటోరియం లో మత సామరస్యం పై జరిగిన జాతీయ సదస్సులో తులసి రెడ్డి ఆత్మీయ అతిథి గా పాల్గొన్నారు.మాజీ మంత్రి వడ్డే శోభనా ద్రీశ్వర రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ 3 వేల సంవత్సరాల క్రితం మతాలే లేవన్నారు.క్రీస్తు పూర్వం 800 సంవత్సరాల క్రితం హైందవ మతం,క్రీస్తు పూర్వం 3వందల సంవత్సరాల క్రితం బౌద్ధ మతం, క్రీస్తు శకం 400 సంవత్సరాల క్రితం జైన మతం,క్రీస్తు శకం 600 సంవత్సరాల క్రితం ఇస్లాం మతం,క్రీస్తు శకం 15 వ శతాబ్దం లో సిక్కు మతం,క్రీస్తు 1800 లో క్రైస్తవ మతం ఆవిర్భావ వించాయని తులసి రెడ్డి అన్నారు. మతోన్మాదం దేశ సమైక్యతకు,సమగ్రతకు ప్రమాదకరమని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో హిందూ,ముస్లిం,క్రైస్తవ, సిక్కు ఇలా అన్ని మతాల వారు పాల్గొన్నారని అన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో బిజెపి,ఆర్ యస్ యస్ పాత్ర ఏ మాత్రం లేదన్నారు. ఈ సమావేశంలో రాజ్య సభ సభ్యులు ఇమ్రాన్ ప్రతాప్ ఘడి, సుప్రీం కోర్టు ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్,విజయా రావు,శ్రీనివాస రావు,అజీజ్ పాసా ,పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## తండ్రి ప్రగాఢ సంకల్పం.. వ్యవసాయం..

### శక్తి లేని స్థితిలో తండ్రి... జైలులో కొడుకు...



**పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 13 :** చదవడానికి ముందు... సున్నితంగా కళ్ళు మూసుకోండి... మీ చుట్టూ ఉన్న వారందరికీ సహాయం చేయాలనే మంచి ఉద్దేశాన్ని మీ హృదయంలో అనుభూతి చెందండి... మెల్లగా కళ్లు తెరిచి చదవడం కొనసాగించండి... ఎక్కడ మనః సంకల్పం ఉంటుందో, అక్కడ మార్గం ఉంటుంది! ఒకప్పుడు, ఒక వృద్ధుడు మిన్నెసోటాలో అనే ప్రాంతంలో ఒంటరిగా నివసించేవాడు. అతను తన పొలంలో బంగాళాదుంప తోటను వేయాలనుకున్నాడు, కానీ ఆ వృద్ధుడికి ఆ పని చాలా శ్రమతో కూడుకున్నది. ఈ పనిలో సహాయపడగలిగే తన ఏకైక కుమారుడు జైలులో ఉన్నాడు. వాస్తవానికి అతని కుమారుడిని కొన్ని అపార్థాల కారణంగా, పొరపాటుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పేదరికం కారణంగా బెయిల్ కూడా పొందలేకపోయాడు. పొలం సిద్ధం చేయాల్సిన సమయం వచ్చింది, కాని ఆ తండ్రి నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. వృద్ధుడు బాధతో, తన కొడుకుకు ఒక ఉత్తరం వ్రాసి, అందులో తన పరిస్థితిని ఇలా వివరించాడు: ప్రియమైన కుమారా, ఈ సంవత్సరం బంగాళాదుంప తోటను నాటడం నా వల్ల సాధ్యం కాలేకపోతునందున చాలా బాధగా ఉన్నాను. నీ తల్లికి మొక్కలు నాటడం అంటే ఇష్టం, కాబట్టి తోటపని ఆపివేయడం నాకు ఇష్టం లేదు. కాని ఒంటరిగా తోటలో మట్టిని త్రవ్వడానికి నా వయస్సు సహకరించడం లేదు. నువ్వు ఇక్కడ ఉండి ఉంటే నా కష్టాలన్నీ తీరిపోయేవి, నువ్వు నా కోసం మట్టిని తవ్వి ఉండేవాడివని నాకు తెలుసు. ప్రేమతో, నాన్న వెంటనే వృద్ధుడు తన లేఖకు స్పందిస్తూ కొడుకు నుండి టెలిగ్రామ్ అందుకున్నాడు : అందులో - 'నాన్న, దయచేసి తోటను తవ్వకండి !! చాలా విలువైన తుపాకీలను అక్కడే పాతిపెట్టాను!!' అని వ్రాసిఉంది. ఈ ఉత్తరాన్ని చూసి తండ్రి చాలా బాధపడ్డాడు. మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు, డజను మంది ఎఫ్‌బిఐ ఏజెంట్లు, స్థానిక పోలీసు అధికారులు వచ్చి, ముందస్తు నోటీసు ఏమీ లేకుండా తోట మొత్తాన్ని తవ్వారు. చివరికి వెతుకుతున్నది దొరకనందుకు వాళ్ళందరూ నిరాశపడ్డారు.
కంగారు పడ్డ ఆ వృద్ధుడు కొడుక్కి ఏం జరిగిందో చెబుతూ మరో చీటీ రాసి, ఇకపై ఏమి చేయాలో చెప్పమని అడిగాడు.

దానికి కొడుకు ఇలా సమాధామిచ్చాడు : ' ఇప్పుడు ఇంక బంగాళదుంపలు నాటండి, నాన్న. ఇక్కడ నుండి నేను మీ కోసం చేయగలిగిన ఉత్తమమైనది సహాయం ఇదే.' మనం ప్రపంచంలో ఎక్కడ ఉన్నా, ఏదైనా చేయాలనే ప్రగాఢమైన సంకల్పం కలిగి ఉంటే, విషయాలు ఖచ్చితంగా పూర్తవుతాయి. అన్నిటికి మించి ఏదైనా చేయాలనే బలమైన ఉద్దేశం ముఖ్యం ! బలమైన సంకల్పం, ఎల్లప్పుడూ పనులు విజయవంతం చేసుకోవడానికి మార్గాన్ని చూపుతుంది. అన్ని సవాళ్లను ఆనందంగా, ఉల్లాసంగా స్వీకరించండి. ఆ తర్వాత ఉదయించే అందాన్ని చూడండి.
దాజీ

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి







**బద్వేల్ పెన్ పవర్ ఏప్రిల్ 13 :** బద్వేల్ ఆర్ఆర్ కళ్యాణ మండపం నందు బి కోడూరు మాజీ జడ్పీటిసి రామకృష్ణ రెడ్డి గారి కుమారుడు వివాహంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన వైఎస్ఆర్సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మరియు రాజంపేట శాసనసభ్యులు శ్రీ ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి గారు వారితో బద్వేల్ మునిసిపల్ కౌన్సిలర్ యద్దరెడ్డి, వైఎస్ఆర్సీపీ ప్రధాన కార్యదర్శి కోలా కొండయ్య, వైఎస్ఆర్సీపీ సుండుపల్లి వాణిజ్య శాఖ మండల అద్యక్షులు వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ ఐఏఎస్ సిసోడియా బదిలీ 2 ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు



**పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ కడప ఏప్రిల్ 13 :** రెవెన్యూ, భూపరిపాలన శాఖ స్పెషల్ CS RP సిసోడియా (1991) హ్యాండ్లూమ్, టెక్స్టైల్ స్పెషల్ CSగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ CSగా ఉన్న జయ లక్ష్మికి (1995) రెవెన్యూ స్పెషల్ CSగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐటీ సెక్రటరీ కాటమనేని భాస్కర్ (2004) AP HRD సంస్థ డైరెక్టర్గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

## ఖాజీపేటలో రెండు కోట్లతో ఐపి బాంబు ?

**పెన్ పవర్ కాజీపేట రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 13 :** ఒక పొగాకు వ్యాపారానికి చెందిన వ్యక్తి.. సుమారు రెండు కోట్ల మేరకు అప్పులు చేసినట్లు తెలుస్తోంది... సుమారు 33 మంది బాధితులు ఉన్నట్లు సమాచారం.. ఇప్పటికే ఆ వ్యాపారి గ్రామంలో లేకుండా బయటికి వెళ్లినట్లు సమాచారం.. అప్పులు సంబంధించి త్వరలో కోర్టు నుంచి నోటీసులు కూడా రావచ్చని ప్రజల్లో చర్చ నడుస్తోంది.. ఇప్పటికే ఖాజీపేట టౌన్‌లో ఇద్దరు వ్యాపారులు దివాలా తీయడంతో సుమారు ఐదున్నర కోట్ల రూపాయలు బాకీదారులకు బకాయి పడ్డారు.. వారికి చెల్లించలేక గ్రామం వదిలి పరారయ్యారు. తాజాగా మరో వ్యక్తి ఇలా చేస్తుండడంతో ఖాజీపేట లో ఇదే ప్రజల్లో తీవ్రంగా చర్చ నడుస్తుంది.

## నిమ్న కులాలలపై అగ్ర దాడులు ఆటవికం



**శ్రీ కాళహస్తి, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 13 :** స్వాతంత్రం సిద్ధించి ఏళ్ళు బారిపోతున్నా సమాజంలో ఇంకా దివ్య కులాలపై అగ్ర కులాల వారు తెగలడుతుం డలం అలవికమని కుల వివక్ష వ్యతిరేక పోరాల సమితి శ్రీకాళహస్తి డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి మరే అనేది సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అగ్ర కులాల వారిలో గాయపడి స్థానిక విడియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విరూపాక్షపురం గిరిజనులను శనివారం కేవీకిఎస్ పరామర్శించారు. బాడీ అరిగిన తీరును అడిగితెలుకున్నారు. కేవలం తాము అగ్ర కులాల వారమన్ని ఆపాంతోనే గడ్డగుంటకు చెందిన చైతన్య, అతడి తరపు బంధువులు వెంకటేష్ (35), నాగయ్యపై లావేసినట్లు సురేష్ అన్నారు. ఈ తీఘంగా ఖండిస్తున్నామనీ, వెంటనే బాధ్యులపై అట్రాసిటీ కేసు తీసుకోవాలని చేసి చర్యలు చేశాను అంగిరి పుల్లక్క పెనగడం గురవయ్య, గురువారు సంక్రాంతి వెంకటయ్య తదిత పాల్గొన్నారు.

## ఇంటర్ మార్కుల్లో విద్యార్థినీల ప్రతిభ



**పెళ్లకూరు, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 13 :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం. చెంబేడు గ్రామానికి చెందిన మాజీ స్కూల్ చైర్మన్ యోగేశ్వరయ్య ఇద్దరు కుమార్తెలు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. పుట్టు గురు ప్రణతి 1000 గాను 971, పుట్టు నాగ తేజశ్రీ 471 గాను 464 మార్కులు సాధించారు. శ్రీకాళహస్తి పట్టణం ఎంజీఎం జూనియర్ కాలేజీలో కాలేజీ సెకండ్ ర్యాంక్ సాధించారు. ఇంతటి మార్కులు సాధించిన విద్యార్థినీలు ఇద్దరినీ అటు కాలేజీలోనూ, ఇటు గ్రామంలోనూ ప్రశంసించి శాలువాలు కప్పారు. ముందు ముందు మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి చేరాలని గ్రామస్తులు కొనియాడారు.

## జీబీవీకి సన్ షైన్ స్టార్ అవార్డు ..



**పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ చిత్తూరు ఏప్రిల్ 13 :** బి.ఆర్.శ్రావంతి సన్షైన్ స్టార్ అవార్డ్‌కి ఎంపికైన సందర్భంగా చిత్తూరు జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మద్ది పట్ల వెంకట్రమణ, ఇతర సిబ్బంది అభినందనలు తెలియజేసారు. ఈ అమ్మాయి కెజిబివి రొంపిచర్లలో ఇంటర్మీడియట్ సిసి రెండవ సంవత్సరం చదువుతూ ఆంధ్రప్రదేశ్ కెజిబివి పాఠశాలలలో అత్యున్నత ప్రతిభ కనబరిచి 935 మార్కులు సాధించినందుకు వార్డుకు ఎంపికైంది. ఈ గర్వకారణమైన విజయాన్ని గుర్తించి, వారి ప్రతిభకు గుర్తింపుగా ఏప్రిల్ 15వ తేదీ, మధ్యాహ్నం 2:00 గంటలకు, మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా సన్షైన్ స్టార్ అవార్డు అందుకోనున్నారు. ఇది మన కెజిబివి వ్యవస్థకు గర్వకారణం. ఈ విజేతలకు అభినందనలు తెలియజేయడంతో పాటు, ఇతర విద్యార్థినులకు ప్రోత్సాహకంగా నిలిచేలా మనం అందరం కలిసి పనిచేద్దామన్నారు.

## ప్లాస్టిక్ సంచులు వద్దు- గుడ్డ సంచులు ముద్దు

**కావలి పెన్ పవర్, ఏప్రిల్ 13 :** కావలి పట్టణంలోని రైతు బజార్ సెంటర్ వద్ద ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'ఉచిత గుడ్డ సంచులు పంపిణీ' చేయడం జరిగింది. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ బెజవాడ. రవికుమార్, పట్టణ అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ సంచులు వాడకుండా గుడ్డ సంచులు వాడాలని అన్నారు. అదేవిధంగా ఈ గుడ్డ సంచులను తీసుకొన్న ప్రజలు తమ ఇరుగుపొరుగు వారికి కూడా అందజేసి వారిని కూడా అవేర్ చేయవలసిందిగా కోరినారు. కూరగాయల మార్కెట్ లేదా ప్రొవిజన్ షాప్ కాని వెళ్లేటప్పుడు ఈ గుడ్డ సంచులను తీసుకెళ్లడం 'అలవాటు' చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్ సంచు ల్లో వేడి పదార్థాలు వేసిన సంచుల్లో రసాయనాలు కరిగి, మనం తినే ఆహార పదార్థాలలో కలిసి తద్వారా క్యాన్సర్ కి కూడా ప్లాస్టిక్ సంచులు కారణమవుతాయని తెలియజేశారు. భావితరాలకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణ అందజేయడం ప్రతి ఒక్క పౌరుని బాధ్యత అని తెలియజేశారు. ఈ సందర్భంగా గుడ్డ సంచులకు విరాళాలు అందజేసిన దాత సి. హెచ్.వి. రాజశేఖర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆప్యాయంగా పాలకరించుకున్న ఎమ్మెల్యే ముత్తుముల, మాజీ ఎమ్మెల్యే అన్నా





**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 13 :** నెమలిగుండ్ల రంగనాయక స్వామి కాళ్యాణ వేధిక ఇరువురు హేమా హేమీలను కలిపింది. మామధ్య ఎలాంటి వైరాలు లేవు, కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే పార్టీర్థులం అని నెమలిగుండ్ల రంగడి కళ్యాణ వేదికపై నిరూ పించుకున్న సంఘటన ఆదివారం నెమలిగుండ్లరంగస్వామి బ్రహ్మోత్సవాలలో కళ్యాణ సమయంలో చ ంంది. గిద్దలూరు శాసనసభ్యలు ముత్తుముల అశోకరెడ్డి, మాజీ శాసనసభ్యులు అన్నా రాంబాబులు ఇరువురు దంపత్సమేతంగా స్వామివారి కల్యాణంలోపాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి పీటలపై కూర్చున్నారు. ఈ సందర్భంగా ఇరువురు ఒకరినొకరు తారసపడ్డారు . కల్యాణ వేదికపై ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని , కుశల ప్రశ్నలు వేసుకొని ఆప్యాయంగా ఆలింగనం చేసుకొన్నారు. కళ్యాణ సమయంలో కళ్యాణ మూర్తులకు దండలను మార్చే ముందు ఆ పూలదండలను పట్టుకుని చేసిన నృత్యం భక్తులను ఆకట్టుకుంది. దీంతో ఒకాసారిగా కళ్యాణ వేధిక ప్రాంగణంలో శ్రేణులకేరింతలు మారుమ్రోగాయి . ఇరువురు నాయకులు నెమలిగుండ్ల రంగస్వామి ఆలయ అభివృధినే కోరుకున్నారు. ఈ కలయిక అపూర్వమని మన గిద్దలూరు సంస్కృతి సాంప్రదాయాలను కాపడాయని పలువురు అభినందిస్తున్నారు. కేవలం ఎన్నికల వరకే తాము ప్రత్యర్థులం అనిచాటుకున్నారని ఒరుకొంటున్నారు.

## ఘనంగా మట్టల ఆదివారం




**ఏప్రిల్ 13 పెన్ పవర్:** మండలంలో కర్టిస్ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చినందు సండే స్కూల్ పిల్లలచే బట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. సండే స్కూల్ పిల్లలు పురవీధులలో పలు ఏసుప్రభు గూర్చిన మాటలు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రజలను ఆకట్టుకుంది. ర్యాలీ అనంతరము చర్చి ఆవరణములో చర్చి సంఘ పెద్దలు గర్నెపూడి ప్రేమ కిషోర్ కుటుంబం సండే స్కూల్ పిల్లలకు అల్పాహారం. మరియు వివిధ రకాల పెన్నులు పెన్సిళ్ళతోపాటు జామెంట్రీ బాక్స్ చాక్లెట్లను పంపిణీ చేయడం జరిగింది. అనంతరము సంఘ కాపరి డి డి ఎండ్లూరి వాక్యోపదేశం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు కవలకుంట్ల గోవింద ప్రసాద్. దారి వేముల ఎలీషా. మహిళ సంఘం వారు గర్నెపూడి రుతమ్మ. కవలకుంట్ల మార్తమ్మ. గర్నెపూడి. నూనె ప్రియాంక. యూత్ డైరెక్టర్ నూనె హా నోక్. యూత్ పిల్లలు కవలకుంట్ల బాచి. కిరణ్. చింటూ. ప్రిన్స్. కార్తీక్. గోపి. సండే స్కూల్ టీచర్ కవలకుంట్ల అనూష. సండే స్కూల్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు. దొనకొండ లో టౌన్ ఏ బీ ఎం చర్చి సండే స్కూల్ పిల్లలచే మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు సండే స్కూల్ పిల్లలు పురవీధులలో పలు ఏసుప్రభు గూర్చిన మాటలు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు ర్యాలీ అనంతరము ఏ బి ఎం చర్చి ఆవరణములో చర్చి సంఘ పెద్దలు కే జి ఎస్ రాజు. మల్లెల ఆనంద్ కుమార్ ఆదిమూలపు ప్రభుదాసు సండే స్కూల్ పిల్లలకు అల్పాహారం వివిధ రకాల పెన్నులు పెనుసులతోపాటు జామెంట్రీ బాక్సు స్వీట్లు కేకులు పంపిణీ చేయడం జరిగింది అనంతరం ఏ బి ఎం సంఘ కాపరి డి ప్రభుదాసు వ్యాప్ కోపదేశం అందించారు ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు ఎండి సుధాకర్ నూనె సుధీర్ సండే స్కూల్ టీచర్లు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర

### ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడి




**కావలి పెన్ పవర్ - ఏప్రిల్13 :** టీటీడీ గోమరణాలపై భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని, మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర చేపట్టారని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అలజడి సృష్టించేందుకు, ప్రశాంతతకు భంగం కలిగించేందుకు టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వృద్ధాప్యం కారణంగా టిడిడి గోశాలలో గోవుల సహజ మరణాలపై దుష్ప్రచారం చేస్తున్న కరుణాకర రెడ్డి వాఖ్యలను తీవ్రంగా ఖండించారు. టిటిడి గోశాలలో 100 ఆవులు చనిపోయాయన్న కరుణాకర రెడ్డి మాటలుపచ్చి అబద్ధాలన్నారు. ఎక్కడో చనిపోయిన గోమాతల ఫోటోలను మార్ఫింగ్ చేసి టిడిడి గోశాలపై దురుద్దేశాలు ఆపాదిస్తున్నారని మండి పడ్డారు. కోటి మంది దేవతలకు సమానమైన గోమాతలపై దుష్ప్రచారం చేస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. టిటిడి గోశాలలో గోవుల పరిరక్షణ సంరక్షణ కోసం దాదాపు 260 మంది పని చేస్తుంటారని, ఇందులో భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గోవుల సహజ మరణాలపై అసత్య ప్రచారాలు చేస్తూ టిటిడి ప్రతిష్టకు భంగం కలిగించే వారిపై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## రమణీయంగా శాంతి కళ్యాణ మహోత్సవం





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 13 :** శ్రీ హరిహర క్షేత్రంలో శనివారం రాత్రి హరి హర శాంతి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. మాజీమం త్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు, శిద్దా సుధాకర్ దంపతులు,శిద్దా సుధీర్ కుమార్ దంపతులు,శిద్దా బాలాజీ దంపతులు, శిద్దా సురేష్ దంపతులు కళ్యాణం ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఆగమ విశారద కృష్ణ శర్మ బృందం అధ్వర్యంలో వైష్ణవ,శైవ ఆగమం ప్రకారం శిద్దా కుటుంబ సభ్యుల చే శాంతి కల్యాణ క్రతువు శాస్త్రోక్తంగా నిర్వహింప చేశారు. ఈ సందర్భంగా శిద్దా సుధీర్ కుమార్, శృతి దంపతులు హరి హర శాంతి కల్యాణం పురస్కరించుకుని స్వామి వారికి అమ్మవారికి పట్టు వస్త్రాలు, రజిత యజ్ఞోపవేతం,ప్రత్యేక ముత్యాల తలంబ్రాలు,పూలు, పండ్లు నూతన వస్త్రాలు సమర్పించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, గోవింద నామాలు,భక్తుల సందడి నడుమ శివ కేశవ కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. కళ్యాణం ప్రధాన ఘట్టం మంగళ సూత్ర ధారణ అత్యంత కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు వారి కుటుంబ సభ్యులతో కలసి శివ కేశవులకు ముత్యాల తలంబ్రాలు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. కల్యాణ మహోత్సవం వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. కల్యాణ మహోత్సవం అనంతరం శిద్దా రాఘవరావు దంపతులు మాట్లాడుతూ శ్రీ హరిహర క్షేత్రం 19 వ వార్షోత్సవం సందర్భంగా నిర్వహించిన శాంతి కళ్యాణంలో పాల్గొనడం సంతోషంగా ఉందని శివ కేశవుల కృపతో సమస్త మానవాళి సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుణ్ణి ప్రార్ధించినట్లు తెలిపారు. అనంతరం వేద పండితులు శిద్దా రాఘవ రావు దంపతులకు, శిద్దా పాండురంగరావు దంపతులకు,శిద్దా సుధాకర్ దంపతులకు, శిద్దా సుధీర్ దంపతులకు,శిద్దా బాలాజీ దంపతులకు, శిద్దా సురేష్ స్వామి వారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, వేద ఆశీర్వదాలు అందచేసారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో కల్యాణానికి విచ్చేసిన భక్తు లందరికి కల్యాణ తలంబ్రాలు,తీర్థప్రసాదాలు, అల్పాహారం అంద చేశారు. ఈ కార్యక్రమంలో,శిద్దా వెంకటేశ్వర్లు,శిద్దా హనుమంత రావు, శిద్దా సాయి బాబు,శిద్దా వెంకట ప్రసాద్, శిద్దా శ్రీనివాస రావు, శిద్దా కాశీ,మారం వెంకారెడ్డి, బొమ్మిశెట్టి కిరణ్ కుమార్, బొగ్గవరపు సుబ్బారావు, శ్రేయోభిలాషులు, భక్తులు పాల్గొన్నారు.

## గోపానిపల్లె ఏబీయం హైస్కూల్లో ఆకట్టుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశం



**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 13 :** గత 25 సంవత్సరాల క్రితం ఆటపాటలతో ఆనందంగా గడిపి విద్యను అభ్యసించిన విద్యార్థులందరూ ఒక చోటకు చేరి తీపి జ్ఞాపకాల నెమరు వేసుకుంటూ పండుగ వాతావరణంలో గడిపిన అరుదైన సంఘటన, సన్నివేశాలు ఆదివారం కొమరోలు మండలం గోపాని పల్లి లోని ఏబీఎం పాఠశాలలో చోటు చేసుకున్నది. కొమరోలు మండలంలో గల ఎయిడెడ్ పాఠశాలల్లో పేరు ప్రఖ్యాతులు గడించిన ఆనాటి పాఠశాలల్లో మొదటి స్థానంలో నిలిచేవి ఆర్ సి ఎం పాఠశాలలు, ఏబీఎం పాఠశాలలు , ఎస్బిఎన్ఆర్ఎం పాఠశాలలని చెప్పవచ్చు. కొమరోలు మండలం గోపానిపల్లెలో కొన్ని దశాబ్దాల క్రితం ఏబీఎం ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. సదరు పాఠశాల అభివృద్ధి చెంది హై స్కూల్ స్థాయికి చేరింది. ఆ పాఠశాలలో చదివిన అనేకమంది విద్యార్థులు గొప్ప గొప్ప ఉద్యోగాలు పొంది ఉండగా, మరికొందరు వివిధ రంగాలలో స్థిరపడి ఉన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారు కూడా ఉన్నారు. 1999 -2000 విద్యా సంవత్సరంలో ఆ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకున్న నాటి విద్యార్థిని విద్యార్థులందరూ ఈనెల 13వ తేదీ ఆదివారం ఆ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దాదాపు 25 సంవత్సరాల తరువాత నాటి విద్యార్థులందరూ ఒకచోటకు చేరి అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ప్రస్తుత పరిస్థితులు, వారి హోదాల వివరాలను పంచుకుంటూ ఆనందంగా గడిపిన అపురూప సన్నివేశాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఆ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాటి తమ గురువులను సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు .మరొక ఆసక్తికరమైన సన్నివేశం ఏమంటే అదే పాఠశాలలో విద్యార్థులుగా చేరి చదువుకొని పాఠశాలను వదిలి వెళ్ళిన కొందరు పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులుగా అదే పాఠశాలలో పనిచేసే అవకాశం లభించడం. అలాంటి వారిలో కొందరు పదవీ విరమణ కూడా చేశారు .ఆ సందర్భంగా తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఆ పాఠశాల యాజమాన్యానికి వారు భావోద్వేగంతో హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. నాడు పాఠశాలను స్థాపించిన స్వర్గీయ గుర్రం ఐజయ్య , గుర్రం విమలమ్మ ,గుర్రం జీవరత్నం, డి మార్తమ్మ ,గుర్రం ప్రభాకర్ బాబు లను జ్ఞాపకం చేసుకుంటూ వారి సేవలను కొనియాడారు. వారితోపాటు ప్రస్తుతం పాఠశాల నిర్వహిస్తున్న యాజమాన్యానికి కూడా వారు ధన్యవాదాలు తెలుపుతూ, పాఠశాలను మరింత ఉన్న స్థాయికి తీసుకెళ్లి పాఠశాలకు పూర్వ వైభవాన్ని కల్పించాలని, అందుకు తమ వంతు సహాయ సహకారం అందిస్తామని ప్రకటించారు.

అనంతరం పూర్వ విద్యార్థులు తమ అలనాటి గురువులు ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాఠశాల యాజమాన్యం తో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులందరూ ఒక చోట చేరి ఆనంద ఉత్సవాలు పంచుకోవడంతో ఆ పాఠశాలలో పండుగ వాతావరణం కనిపించింది. పూర్వ విద్యార్థులందరూ కలిసి గ్రూప్ ఫోటోకు ఫోజులు ఇవ్వగా, అలనాటి మిత్రులు తీపి జ్ఞాపకాల కోసం వేరువేరుగా జట్లు జట్లుగా ఫోటోలు తీయించుకున్నారు. పాఠశాల యాజమాన్యం పూర్వ విద్యార్థులకు స్వాగతం పలికి కార్యక్రమాలు విజయవంతం అయ్యేందుకు పూర్తి సహకారం అందించి వారికి వీడ్కోలు పలికారు అందుకు పూర్వ విద్యార్థులు ప్రస్తుత యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

## కోవిలంపాడులో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 13 :** చంద్రశేఖరపురం మండలం కోవిలంపాడు గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలు ఘనముగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా దేవస్థానంలో గణపతి శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ప్రతిష్ట విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సీతా రామచంద్ర స్వాములవారిని ప్రత్యేక అలంకరణలతో కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పట్టు వస్త్రాలు సమర్పించారు. భాజా భజంత్రీలు, వేద పండితులు మంకాల ప్రసాద్ శర్మ వేదమంత్రోచ్ఛారణాల మధ్య ముత్యాల తలంబ్రాలతో కళ్యాణం వైభవముగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అంతా రామ నామస్మరణతో మార్మోగి పోయింది. సీతారామచంద్ర స్వామి కళ్యాణ వేడుకల ఘట్టాన్ని భక్తులు వీక్షించారు. అనంతరం భక్తులు సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయము భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అల్పాహార విందును నీటి సంఘం అధ్యక్షులు దొనపాటి హైమావతి మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారు మధ్యాహ్నం తవ్వా శేషయ్య మరియు కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. అనంతరం సాయంత్రం శ్రీ సీతా రామ లక్ష్మణ స్వామి వార్ల ప్రతిష్ట విగ్రహాలను ట్రాక్టర్ పై ప్రత్యేకంగా అలకరించి మంగళ వాయిద్యాల మధ్య గ్రామోత్సవము అత్యంత వైభవంగా నిర్వహించారు. తదుపరి రాత్రి కి అమడసాని బాలకేశవరెడ్డి కుటుంబ సభ్యులు అన్న ప్రసాద వితరణ



కార్యక్రమమును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దొనపాటి మోహన్ రెడ్డి, అమడసాని బాలకేశవరెడ్డి, దుగ్గిరెడ్డి జయ రెడ్డి, జిల్లెల్ల నారాయణరెడ్డి, దొనపాటి మాధవ, దుగ్గిరెడ్డి పిచ్చిరెడ్డి, దుగ్గిరెడ్డి రాము, దుగ్గిరెడ్డి వెంగళ రెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకార కమిటీ తో భేటీ అయిన అళహరి సుధాకర్

**కావలి పెన్ పవర్ - ఏప్రిల్ 13 :** బోగోలు మండలము, జువ్వలదిన్నె పంచాయితీలో కావలి నియోజకవర్గ మత్స్యకార కమిటీ సభ్యులతో రాష్ట్ర మత్స్యకార కార్యదర్శి కోడింగారి శ్రీను అధ్యక్షతన మరియు నియోజకవర్గ మత్స్యకార అధ్యక్షుడు డా.ప్రళయ కావేరి రవి ఆధ్వర్యములో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐటి కో ఆర్డినేటర్ బాలు మరియు జనసేన పార్టీ కావలి నియోజకవర్గ ఇంచార్జ్ అళహరి సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అళహరి సుధాకర్ మాట్లాడుతూ కావలి నియోజవర్గంలో జనసేన పార్టీ బలోపేతంలో భాగంగా 58 మంది అభ్యర్థులతో మత్స్యకార కమిటీ ఏర్పాటు చేసిన విషయము తెలిసిందే అన్నారు. అత్యంత పొడవైన సముద్రతీరం ఉన్న ప్రాంతము మా కావలి నియోజకవర్గ & కావున అత్యధిక మత్స్యకార కుటుంబాలు ఈ సముద్రము మీద ఆధారపడి జీవనము కొనసాగిస్తుంటారు అని కావున వారి సాధకబాధకాలు తెలుసుకొని నెరవేర్చేవిధంగా ముందుకు వెళ్ళాలని సూచించినట్లు తెలిపారు. త్వరలో జనసేన రాష్ట్ర మత్స్యకార చైర్మన్ , నర్సాపూర్ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ని ఛీఫ్ గెస్ట్ గా ఆహ్వానించి భారీ మత్స్యకార బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో ముఖ్య నాయకుడు శివ, సాదు శ్రీధర్ , మండా శ్రీను,



డా.తేజ, మత్స్యకార మండల కార్యదర్శి యానాది, జువ్వదిన్నె పంచాయితీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, మండల కార్యదర్శి నాగరాజు, సంయుక్త కార్యదర్శులు బాబు, మునితాత, ప్రకాష్ మరియు కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, దాసు, ఏడుకొండలు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నెమలి గుండ్ల రంగస్వామికి పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 13 :** గిద్దలూరు నియోజకవర్గంలో జేపీ చెరువు సమీపంలో నలమల్ల అటవీ ప్రకృతి సోయగాలు మధ్య వెలసిన నెమలిగుండ్లరంగస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవరోజు ఆదివారం మధ్యాహ్నం నెమలిగుండ్ల రంగస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కళ్యాణానికి గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోకరెడ్డి, సతీమణి పుష్పలీల దంపత్సమేతంగా స్వామిని దర్శించుకుని, రంగడి కళ్యాణానికి సాంప్రదాయం ప్రకారం సంప్రదాయంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే దంపతులకు అలయ మర్యాదలతో పూర్ణకుంభం, భాజభజంత్రీల తో కళ్యాణం వేదిక వద్దకు తోడ్కొని వచ్చారు . అనంతరం పట్టు వస్త్రాలు సమర్పించి పీటలపై కుర్చీని కళ్యాణము నిర్వహించారు. కల్యాణం వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఏడాది స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఎమ్మెల్యే ముత్తుముల ఆధ్వర్యంలో అంగ రంగ వైభవంగా జరుగుతున్నాయి. భక్తులకు మజ్జిగ చల్లనినీటి సరఫర చేశారు. స్వామి సర్వ దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పొన్నుబోయిన చెంచురామయ్య 22వ వర్ధంతి

### చెంచు రామయ్య స్ఫూర్తితో ముందుకు నడుద్దాం.. ఉదయగిరిని అభివృద్ధి పథంలో నడిపిద్దాం : ఎమ్మెల్యే

**ఉదయగిరి పెన్ పవర్ - ఏప్రిల్ 13 :** గండిపాలెం రిజర్వాయర్ సాధనకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పొన్నుబోయిన చెంచురామయ్య 22వ వర్ధంతి కార్యక్రమం ఆయన కుమారుడు మాజీ జడ్పీ చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి పట్టణ పరిధిలోని చంచల బాబు గెస్ట్ హౌస్ నందు ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ శ్రీమతి ప్రవీణ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రియతమ నాయకులు దివంగత నేత మాజీ ఎమ్మెల్యే పొన్నుబోయిన చెంచురామయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదర్శనీయుడు పొన్నుబోయిన చెంచురామయ్య అన్నారు. ఆయన స్ఫూర్తితో కలిసికట్టుగా ముందుకు నడిచి ఉదయగిరిని అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. సుమారు 50 సంవత్సరాల క్రితం బీసీ నాయకుడు ఎమ్మెల్యేగా గెలుపొంది మెట్ట ప్రాంతం పై అసెంబ్లీలో గళం విప్పి గండిపాలెం రిజర్వాయర్ ను సాధించారు అంటే చాలా గొప్ప విషయం అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు క్యాబినెట్ లోకి రమ్మని ఆహ్వానించిన, నాకు మంత్రి పదవి వద్దు, నేను వరి అన్నం తింటున్నాను, మా ప్రాంత ప్రజలు సంగటి తింటున్నారు. విశాలమైన భూభాగం కలిగినప్పటికీ తాగు త్రాగునీరు లేక అలమటిస్తున్నారు. గండిపాలెం రిజర్వాయర్, నక్కల గండి, బసి నేనిపల్లి రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని పట్టుబట్టి ఆ కాలంలోనే ఇరిగేషన్ ప్రాజెక్టులో సాధించిన నేతగా రైతన్నల గుండెల్లో స్థిరంగా నిలిచి ఉన్నారని, అటువంటి నేత వర్ధంతిని జరుపుకోవడం, ఆ కార్యక్రమంలో పాల్గొనడం, ఈ సభలో ఆయన కుమారుడు ఉండడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన విగ్రహాలను గండిపాలెం రిజర్వాయర్ ప్రాజెక్టు వద్ద మరియు ఉదయగిరి లోని ట్యాంకుబండ పై ఏర్పాటు చేసుకొని ఆయనను స్మరించుకోవాలన్నారు. చెంచురామయ్య తర్వాత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, హయాంలో చెరువులు అభివృద్ధి చెందాయి అన్నారు. ఆ తరువాత ఈ ప్రాంతం వివక్షకు గురైందన్నారు. సోమశిల హై లెవెల్ కెనాల ద్వారా నియోజకవర్గంలోని రెండు మండలాలకు అరకోరాగా నీరు అందుతుంది, తప్పనిచ్చి మనకు సరైన ప్రాజెక్టులు లేవు అన్నారు. కనీసం త్రాగు నీరు కూడా లేక కొన్ని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వాటిని అధిగమించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నానని, సోమశిల జలాల ద్వారా ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేస్తే తప్ప మంచినీటి సమస్య తీరదన్నారు. ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. మదర్ ప్లాంట్ల వ్యవహారం ప్రారంభ దశలో ఆగిపోయి ఉందన్నారు. వీటన్నిటిని అధిగమించి ఉదయగిరి అభివృద్ధి పదంలో నడవాలి అంటే తెలుగుదేశం జెండా ఉదయగిరి కోటపై రెపరెపలాడుతూనే ఉండాలన్నారు. అంతకుముందు మాజీ జెడ్పి చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్ మాట్లాడుతూ నాటి కాలంలో మా తండ్రి చెంచురామయ్య నేడు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మెట్ట ప్రాంతం పై అసెంబ్లీలో గళం విప్పారని, ఉదయగిరి అభివృద్ధి కాకర్లతోనే సాధ్యమన్నారు. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా సామాన్యుడి వలె అందరితో కలిసిపోతూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అని కొనియాడారు. ముందుగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శ్రీమతి ప్రవీణ దంపతులకు ఘన స్వాగతం పలికి శాలువా పూలమాలలతో పొన్నుబోయిన చంచల బాబు ఘనంగా సన్మానించారు. టిడిపి మండల కన్వీనర్ సిహెచ్ బయన్న అధ్యక్షతన జరిగిన. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, ఎస్ కే రియాజ్ నల్లి, పోగు రాజా నల్లి పోగు నరసింహులు చీకటి రవీంద్రబాబు బుజ్జం వెంకటకృష్ణారెడ్డి గూడా నరసారెడ్డి దేగ మధు యాదవ్ ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ కి పద్మనాభరెడ్డి ఆత్మీయ లేఖ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎవరీ పద్మనాభరెడ్డి. జగన్ కి ఆయనకు ఏమిటి అనుబంధం. ఎందుకీ ఆత్మీయ లేఖ అన్న డౌట్ ఠక్కున ఎవరైనా రావచ్చు. పద్మనాభరెడ్డి దశాబ్దాలుగా ఏపీలో రాజకీయం గురించి తెలిసిన వారికి పరిచయం ఉన్న వారే. అలాగే ఆయనకు జగన్ కి అనుబంధం పెనవేసిన పార్టీగా వైసీపీ ఉంది. మరి ఆయన పూర్తి పేరు చెబితే అందరికీ ఎరుక అవుతుంది. ఆయన ముద్రగడ పద్మనాభరెడ్డి. వెనకటి పేరు ముద్రగడ పద్మనాభం. ఈ రోజుకీ అంతా అలాగే పిలుస్తారు. కానీ పవన్ మీద పిఠాపురంలో పందెం కట్టిన ఆయన తన పేరుని పంతం కొద్దీ మార్చుకున్నారు. అలా గెజిట్ నోటిఫికేషన్ లో కూడా ప్రకటించారు. దాంతో ఎవరు ఆయనను పద్మనాభంగా పిలిచినా ఆయన మాత్రం తన లెటర్ ప్యాడ్ మీద కానీ తన సంతకం కానీ పద్మనాభరెడ్డి గానే పేర్కొంటూ ఉంటారు. ఇక ఆయన తాజాగా జగన్ కి తాజాగా లేఖ రాసారు. ఆ లేఖ మొత్తం జగన్ మీద ప్రేమ ఆత్మీయత ఉంది. తనకు వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీలో స్థానం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ప్రేమతో ఈ పదవి ఇచ్చారాని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.ఇక తన మీద బాధ్యతలు పెట్టినందుకు ఆయన స్వాగతిస్తూనే జగన్ ని అధికారంలోకి తిరిగి తెచ్చేలా తన శక్తివంచన లేకుండా కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు. ఇక జగన్ ఒక్కరే పేదలకు ఆక్సిజన్ లాంటి వారు అని అన్నారు. అంతే కాదు వైసీపీ 2029లో అధికారంలోకి తప్పకుండా వస్తుందని నమ్మకంగా చెబుతున్నారు. వైసీపీ పవర్ లోకి వచ్చాక సీఎం పీఠం మీద ఎవరూ తొంగి చూడకుండా చిరకాలం జగన్ పాలించాలని ఆ విధంగా ఆయన పాలన ఉండాలని పద్మనాభరెడ్డి మనసారా కోరుకున్నారు.ఇదిలా ఉంటే ఏపీలో కూటమి పాలనలో పేదలకు న్యాయం జరగడంలేదనే పరోక్ష విమర్శ కూడా ఆయన లేఖలో ఉందని అంటున్నారు. జగన్ పేదలకు ఆక్సిజన్ అంటే ఇతర పార్టీలు కాదనే అర్థం కదా అని అంటున్నారు. మరో వైపు చూస్తే జగన్ సీఎం సీటు ఎక్కాక మరొకరు ఆ వైపు చూడకూడదని ఆయన కోరుకుంటున్నారు.ఏపీలో చూస్తే వెయిటింగ్ చీఫ్ మినిస్టర్లుగా ఇద్దరు కనిపిస్తారు. ఒకరు నారా లోకేష్. మరొకరు పవన్ కళ్యాణ్. పైగా పవన్ ముద్రగడ సామాజిక వర్గానికి చెందిన వారే. ఇక ఆ సామాజిక వర్గం నుంచి ఇప్పటిదాకా ఎవరూ సీఎం కాలేదు. కానీ ముద్రగడ మాత్రం జగన్ ఎప్పటికీ సీఎం కావాలని కోరుతున్నారు.మొత్తానికి చూస్తే జగన్ పట్ల అదే ప్రేమ ఆత్మీయత చూపిస్తున్న పద్మనాభం అలియాస్ పద్మనాభరెడ్డి గోదావరి జిల్లాలలో జనసేన తాకిడిని తట్టుకుని వైసీపీని 2029 ఎన్నికల నాటికి అక్కడ బలోపేతం చేస్తారా అన్నదే అంతా చర్చిస్తున్నారు. అయితే రాజకీయ గాలి మారిన నాడు ముద్రగడ కూడా తన అసలు పవర్ ఏంటో చూపిస్తారు అంటున్నారు.

## 64-54.... వివాహేతర బంధం.. సిగ్గుపడిన వేళ!



**హైదరాబాద్ పెన్ పవర్:** మన దేశంలో వివాహేత బంధం కూడా చట్టబద్ధం అయిపోయిన విషయం తెలిసిందే. దీనికే చట్టం పరిభాషలో %-%సహజీవనం%-%. అయితే..ఇలాంటి వివాహేత బంధం కూడా సిగ్గు పడే ఘటన ఒకటి ఏపీలో చోటు చేసుకుంది. వయసు, బాధ్యతలు, కుటుంబాలను కూడా విస్మరించి.. సంబంధంలో మునిగి తేలిన జంట.. చివరకు అఘాయిత్యానికి పాల్పడి.. ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య అల్లాడుతున్నారు. వీరి కథ తెలిసిన వారు జాలి పడాల్సింది పోయి.. తిట్టిపోస్తున్నారు. మరి అలా ఉంది వీరి కథ!!

**ఎక్కడ? ఎవరు?**

బాపట్లకు చెందిన లక్ష్మీనారాయణకు 64 సంవత్సరాలు. రైల్వేలో పనిచేసి రిటైరయ్యారు. భార్య సహా పెళ్లి చేయాల్సి న ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. కుటుంబ పోషణ కోసం.. ఆయన ఓ చోట రైల్వే టికెట్ల బుకింగ్ కేంద్రాన్ని పెట్టుకున్నారు. ఈ క్రమంలో ఇక్కడకు వచ్చిన మాదవి అనే మహిళతో నారాయణకు పరిచయం ఏర్పడింది. పోనీ.. ఈమె వయసేమన్నా తక్కువా? అంటే.. కాదు.. ఈమెకు కూడా 54 ఏళ్ల వయసు.

అంతేకాదు.. ఈమెకు కూడా భర్త, పెళ్లి అయిన కుమార్తె, పెళ్లీడుకు వచ్చిన కొడుకు ఉన్నారు. అయితేనేం.. బుద్ధి కర్మానుసారిణి.. అన్నట్టుగా.. ఇరువురి మధ్య ప్రేమ చిగురించి.. అది కాస్తా వివాహేతర బంధానికి దారి తీసింది. వారానికి మూడు నుంచి నాలుగుసార్లు ఇరువురూ.. బయటకు వెళ్తున్నారని స్థానికులు తెలిపారు. ఇదిలావుంటే.. తాజాగా లక్ష్మీనారాయణతో ఒక రోజంతా ఉండాలని భావించిన మాధవికి అవకాశం రాలేదు.ఇంతలో లక్ష్మీనారాయణ సతీమణి.. అరుణకు.. కంటి ఆపరేషన్ అవసరమైంది. ఈ నేపథ్యంలో ఆమెను హైదరాబాద్‌కు తీసుకువెళ్లేందుకు ఆయన రెడీ అయ్యారు. ఈ విషయం తెలిసిన ప్రేమికురాలు మాధవి.. నువ్వు ఇక్కడే ఉండు.. మనం మీ ఇంటికి వెళ్దాం.. ఆమెను పిల్లలతో కలిపి హైదరాబాద్‌కు పంపించు.. అని చెప్పింది. కానీ, ఎంతైనా కట్టుకున్న బంధం కదా.. అనుకున్నాడో ఏమో.. లక్ష్మీనారాయణ.. తన భార్యతో తానే వెళ్తానని.. ఆపరేషన్ చేయించి వస్తానని చెప్పాడు.

కానీ, మాధవి వినిపించుకోలేదు. అంతేకాదు.. హుటాహుటిన పెట్రోల్ డబ్బాతీసుకువచ్చి.. నారాయణపై పోసి.. తనపైనా పోసుకుని నిప్పంటించుకుంది. మాధవి 80 శాతం, లక్ష్మీనారాయణ 60 శాతం కాలిపోయారు. వెంటనే స్థానికులు ఇద్దరినీ చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ విషయం వైరల్ గా మారడంతో అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. పెళ్లీడు కొచ్చిన పిల్లలను వదిలేసి ఇదేం పని! అని శాపనార్థాలు పెడుతున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

# తండ్రి ఓడించారు...కొడుకు అదే జెండా పట్టుకున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయాలు అంటే ఇవేనేమో అనిపిస్తుంది జరుగుతున్న వాటిని చూస్తే. ఒక రాజకీయం ఇంట్లోకే వచ్చేసినట్లుగా ఉంది. ఇదిలా ఉండగా విశాఖ జిల్లా గాజువాకలో వైసీపీకి చెందిన కీలక నేత కుటుంబం నుంచి కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి జనసేనలో చేరుతున్నారు. తిప్పల నాగిరెడ్డి వైసీపీలో ఉన్నారు. ఆయన 2019లో గాజువాక నుంచి వైసీపీ తరఫున పోటీ చేసి జనసేన నుంచి పోటీ పడిన ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ని ఓడించారు.

దాంతో జెయింట్ కిల్లర్ గా పేరు గడించారు. ఇక తిప్పల కుటుంబానికి రాజకీయంగా గాజువాకలో ఎంతో పేరు ఉంది. మొదట కాంగ్రెస్ లో ఉన్న తిప్పల కుటుంబం ఆ తరువాత వైసీపీలో చేరింది. ఇక తిప్పలకు ఎమ్మెల్యే కావాలన్నది కోరిక. 2009 నుంచి ఆయన పోటీ చేస్తే 2019లో ఆయన కోరిక తీరింది. ఆయన మూడు సార్లు ఎమెల్యేగా పోటీ చేస్తే ఒకసారి విజయం సాధించారు.

అయితే వైసీపీ ఆయనకు రెండు సార్లు అవకాశం ఇచ్చింది. ఇక గాజువాక వైసీపీ ఇంచార్జి గా తిప్పల దేవన్ రెడ్డిని వైసీపీ నియమించింది. తిప్పల నాగిరెడ్డి రాజకీయ వారసుడిగా ఆయన కుమారుడిని తీసుకుని వచ్చారు. దానికి వైసీపీ అధినాయకత్వం ఆమోదముద్ర వేసింది.అయితే అదే తిప్పల కుటుంబంలో మరో కుమారుడు అయిన తిప్పల వంశీరెడ్డి జనసేనలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. దాంతో వైసీపీలో కలకలం చెలరేగుతోంది. విశాఖలో వైసీపీ మేయర్ ని గద్దె దించడానికి కూటమి గట్టిగా ప్రయత్నం చేస్తోంది.అయితే కూటమికి సరిపడా కార్పోరేటర్లు ఇంకా కావాల్సి ఉంది. దాంతో ఆయా పార్టీలు వైసీపీ మీద గురి పెడుతున్నారు. ఈ క్రమంలో తిప్పల నాగిరెడ్డి కుమారుడితో మాజీ మంత్రి జనసేనకు చెందిన సీనియర్ నేత అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామక్రిష్ణ చర్చలు జరిపారు. అవి ఫలవంతం కావడంతో రేపో మాపో జనసేన అధినేత పవన్ సమక్షంలో తిప్పల వంశీరెడ్డి ఆ పార్టీ తీర్థం పుచ్చుకుంటారు అని అంటున్నారు.ఇదిలా ఉంటే అన్న తండ్రి ఉన్న వైసీపీలో ఉండకుండా వంశీరెడ్డి ఎందుకు ఇలా



చేస్తున్నారు అంటే అక్కడే రాజకీయం ఉందనే వారు ఉన్నారు. ఈ రోజుల్లో తండ్రి ఒక పార్టీ కొడుకు మరో పార్టీగా ఉండడం అన్నది సర్వసాధారణమే అని అంటున్నారు.

పైగా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అధికారం ఇంట్లో ఉండేలా నాయకులు తమదైన శైలిలో ప్లాన్స్ చేస్తున్నారు అని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే వైసీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ అవిశ్వాసాన్ని తీసుకుంది. మేయర్ సీటుని తాము కాపాడుకుంటామని వైసీపీ నేతలు అంతా ముక్తకంఠంతో చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో సీనియర్ నాయకులుగా ఉన్న వారి కుటుంబ సభ్యులే పార్టీ గీత దాటి వెళ్తాంటే వైసీపీని కాపాడేది ఎవరు అన్న చర్చ వస్తోంది. వైసీపీని దించేస్తామని కూటమి నేతలు కచ్చితంగా చెబుతుంటే తమ పార్టీ వారిని కాపాడుకోలేని స్థితిలో వైసీపీ ఉందా అన్న చర్చ సాగుతోంది.

ఇక వైసీపీ మేయర్ ని దించేసేందుకు అనువైన వ్యూహాల కోసం టీడీపీ కూటమి పెద్దలు తాజగా విశాఖలో ఒక హొటల్ లో సమావేశం అయి అన్ని విషయాలను చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవిశ్వాసాన్ని గెలిచి తీరుతామని కూటమి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# సామాజిక వర్గాలపై.. కూటమి వ్యూహం.. జగన్‌కు చెక్ ..!

**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే ఎన్నికలకు సంబంధించి.. కూటమి ప్రభుత్వం ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ ప్రారంభించింది. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో వైసీపీకి బలమైన పోటీ దారుగా .. జనసేన నిలబడేలా చాలా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇక, బీసీలను చంద్రబాబు, టీడీపీ దరి చేర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక, మైనారిటీలు మాత్రమే.. జగన్ వైపు ఉన్నట్టు కనిపిస్తున్నా.. అది ఎంత వరకు అనేది చెప్పడం కష్టంగానే మారింది. ఇలాంటి సమయంలో వైసీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని నిర్ణయించింది.వాస్తవానికి ఆది నుంచి కూడా.. వైసీపీకి ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలు.. చేరువ అయ్యారు. కాంగ్రెస్ కు అను కూలంగా ఉన్న ఆయా వర్గాలను.. వైసీపీ తనవైపు తిప్పుకొని.. 2014 నుంచి ఇప్పటి వరకు కూడా కాపాడు కుంది. తాజా ఎన్నికల్లోనూ కూటమి హవాతో వైసీపీ తుడిచిపెట్టుకుపోయినా.. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో పట్టును నిలబెట్టుకుంది. అయితే.. దీనిపై కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. దీనిలో భాగంగానే ఎస్సీ, ఎస్టీలను తనవైపు తిప్పుకొనేందుకు జనసేన చాలా ప్రయత్నాలు చేస్తోంది.ఎస్సీల నియోజకవర్గాల్లో కార్యక్రమాలు చేపడుతోంది. ఇక, బీసీల విషయానికి వస్తే.. చంద్రబాబు వీరిని మరింత అక్కున చేర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే.. బీసీలకు పెద్ద పీట వేస్తున్నా మని.. పదవులు.. పథకాలు కూడా.. వారికి చేరువ చేస్తున్నామని చెబుతున్నారు. బీసీలు ఎక్కువ గా ఉన్న నియోజకవర్గాల్లో సంక్షేమ పథకాలను మరింత ఎక్కువగా ఇస్తామని కూడాచెబుతున్నారు. మొత్తంగా ఎస్సీ, ఎస్టీ ఓటు బ్యాంకుపై జనసేన, బీసీ ఓటు బ్యాంకుపై టీడీపీ పట్టు పెంచుకుంటున్నాయి.



హిందూ ఓటర్లు.. ఎలానూ.. బీజేపీ లేదా.. జనసేన వైపు మొగ్గు చూపడం ఖాయమనిచర్చ సాగుతోంది. ఇలాంటి సమయంలో జగన్ కూడా వ్యూహాత్మకంగా రాజకీయ అడుగులు వేయకపోతే.. భవిష్యత్తు మరింత ఇబ్బంది అవుతుంది. దీనిని గమనించినజగన్.. గతంలో తాను చేసిన పాలనను, ఇచ్చిన పదవులను ఇప్పుడు గుర్తు చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో తాజాగా ఆయన.. పార్టీ నాయకులు.. వైసీపీ పాలనను ప్రజల మధ్యకు తీసుకువెళ్లాలని ఆయన చెప్పారు. మరి ఇది ఏమేరకు సక్సెస్ అవుతుందో చూడాలి.

# కొలిక్కివస్తున్న కియా కేసు.. ఐదేళ్లుగా ఇంటిదొంగల చేతివాటం!




**హైదరాబాద్ పెన్ పవర్:** కియా పరిశ్రమలోని కారు ఇంజిన్ల మాయం కేసు ఓ కొలిక్కి వస్తోంది. ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో డీజీపీ కార్యాలయమే రంగంలోకి దిగింది. డీజీపీ ప్రత్యేక పర్యవేక్షణలో సుమారు 20 మందితో ప్రత్యేక పోలీసు బృందం కేసును దర్యాప్తు చేస్తోంది. ఈ వ్యవహారంలో కీలక నిందితుడిగా కియా పరిశ్రమలో పనిచేస్తున్న తమిళనాడు వాసిని గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. పరిశ్రమలో మొత్తం 940 కారు ఇంజిన్లు మాయం అవ్వగా, అన్నీ ఒక్కసారే చోరీ అవ్వలేదని నిందితులు, దపదపాలుగా ఇంజిన్లు తరలించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సుమారు ఐదేళ్లుగా ఈ వ్యవహారం నడుపుతున్నారని, ఒక్కో కారు ఇంజిన్ విలువ రూ. 2.50 లక్షలు ఉంటుందని చెబుతున్నారు. మొత్తం రూ. 23.50 కోట్లను ఇంటి దొంగలు దోచేశారని కియా యాజమాన్యం చెబుతోంది.

సత్యసాయి జిల్లా పెనుగొండ మండలంలో ఉన్న కియా పరిశ్రమలో కారు ఇంజిన్ల దొంగతనం కేసులో ఏ1గా కియా ఉద్యోగి ని పోలీసులు గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. గత ఏడాది డిసెంబరు 12న ఒక ఉద్యోగి విధులు నిర్వహించే చోటు వద్ద కాకుండా, వేరే చోట సంచరించినట్లు కియా పరిశ్రమ ప్రతినిధులు గుర్తించారు. అతడి కదలికపై సీసీ కెమెరాల ద్వారా పరిశీలించగా, 940 కారు ఇంజిన్ల మాయం వెనుక అతడే కీలక సూత్రధారి అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అంటున్నారు. ఇంజన్ షాప్ మొబిస్ గేట్ వద్ద అనధికారిక వాహనాలు సంచరించే సమయంలో అతడు ఉన్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని పోలీసులు నిర్ధారించుకున్నారు. దీంతో తమిళనాడులో ఉన్న అతడిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అతడు ఇచ్చిన సమాచారం మేరకు ఇతరుల అదుపులోకి తీసుకునేందుకు వేట కొనసాగిస్తున్నారని చెబుతున్నారు.

ఈ ఏడాది జనవరిలో చేపట్టిన వార్షిక తనిఖీల్లో పరిశ్రమలో 940 ఇంజిన్ల లెక్క సరిపోలడం లేదని పరిశ్రమ ప్రతినిధులు గుర్తించారు. ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న కియా యాజమాన్యం అంతర్గత విచారణ చేపట్టింది. అయితే అసలు దొంగలు ఎవరో అనేది తేలకపోవడంతో గత నెల 19న కియ ఇండస్ట్రియల్ పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం ప్రభుత్వానికి చేరడంతో సిట్ ఏర్పాటుకు ఆదేశించింది. డీజీపీ పర్యవేక్షణలో కేసును వేగంగా కొలిక్కి తేవాలని ఆదేశించడంతో పోలీసులు ఈ కేసును సవాల్ గా తీసుకున్నారని చెబుతున్నారు. దీంతో ప్రధాన అనుమానితుడును అదుపులోకి తీసుకున్న పోలీసులు మొత్తం కుట్రను ఛేదించే పనిలో నిమగ్నమయ్యారు.కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు పలు కీలక అంశాలను గుర్తించినట్లు చెబుతున్నారు. ప్రధానంగా చోరీ వెనుక ఓ రాష్ట్రం వారి పాత్రే ఎక్కువగా ఉందని అనుమానిస్తున్నారు. ప్రధాన నిందితుడు సలీం తమిళనాడు వాసిగా గుర్తించిన పోలీసులు.. మిగిలిన నిందితుల్లో ఎక్కువ మంది ఆ రాష్ట్రం వారే ఉన్నారని అంటున్నారు. కియా పరిశ్రమలో తమిళనాడు వారే ఎక్కువగా పనిచేస్తున్నారు. దీంతో నిందితులు అంతా ఒకరికి ఒకరు సహకరించుకుని దోపిడీకి పాల్పడినట్లు భావిస్తున్నారు. కియాలో మొత్తం 54 ప్లాంట్లు ఉన్నాయి. ప్రధాన పరిశ్రమకు అనుబంధంగా మరికొన్ని అనుబంధ యూనిట్లు పనిచేస్తున్నాయి. ఇక్కడ గంటకు 58 కార్లను తయారు చేస్తారు. రూ.వేల కోట్ల లావాదేవీలు, వేలాది మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. దీంతో తొలుత నిందితులను గుర్తించడంలో జాప్యం జరిగిందని అంటున్నారు. వేలాది మంది పనిచేస్తున్న పరిశ్రమలో దొంగలను గుర్తించడం తమతో కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది కియా యాజమాన్యం. దీంతో గత నెల 19న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత కేసు దర్యాప్తులో వేగం పెరిగి నిందితుల గుట్టు రట్టైందని అంటున్నారు.

# సన్‌రైజర్స్.. బౌలింగ్‌పైనా గురిపెడితేనే



**హైదరాబాద్ పెన్ పవర్:** స్వయంగా కెప్టెనే స్టార్ పేసర్. అతడికి తోడుగా ఓ సీనియర్ ఫాస్ట్ బౌలర్. వీరితోపాటు ఒకప్పటి 'పర్పుల్' క్యాప్ హీరోనూ పేసర్‌గా తెచ్చుకుంది. ఇంతమంది స్టార్లున్నా సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ మాత్రం తీసికట్టుగానే తయారవుతోంది. ఒకప్పుడు ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ అంటే అందరికీ హడల్. ఇప్పుడు మాత్రం వీరి బౌలింగ్‌లో ప్రత్యర్థి బ్యాటర్లు వీరబాదుడు బాదుతుండటం ఫ్యాన్స్‌ను నిరాశకు గురి చేస్తోంది. తాజాగా పంజాబ్ కింగ్స్ హైదరాబాద్‌పై 240ం పరుగులు చేయడం గమనార్హం. బ్యాటర్లు రాణించి భారీ టార్గెట్‌ను ఛేదించారు కాబట్టి సరిపోయింది. లేకపోతే మరో ఓటమిని మూటగట్టుకునేదే.

**ఆ పరిణితి ఎక్కడ?**

టీ20ల్లో బ్యాటర్లదే హవా అని తెలిసిందే. కానీ, తెలివిగా బంతులేస్తే వారిని కట్టడి చేయొచ్చని బౌలర్లు నిరూపించారు. పవర్‌ప్లేలో బ్యాటర్లు విరుచుకుపడుతూ ఉంటారు. అక్కడా వికెట్లు తీసి సత్తా చాటిన 'స్టార్' పేసర్లూ ఉన్నారు. ఆ జాబితాలో భువనేశ్వర్ కుమార్ ఒకడు. అతడిని వదిలేసిన ఎస్ఆర్‌హెచ్ షమీని తీసుకుంది. షమీ కూడా సీనియరే. భారత్ తరఫున ఎన్నో మ్యాచుల్లో గెలిపించాడు. ఐపీఎల్‌లోనూ పలు సీజన్లలో తన సత్తా ఏంటో చూపించాడు. గుజరాత్ తరఫున గత ఎడిషన్లలో అదరగొట్టాడు. అలాంటి బౌలర్ నుంచి హైదరాబాద్ అభిమానులు చాలా ఆశించారు. తీరా ఇక్కడికి వచ్చాక నాణ్యమైన ప్రదర్శన చేయలేక ఇబ్బందిపడుతున్నాడు. గత ఐదు మ్యాచుల్లో కనీసం 11 ఎకానమీతో పరుగులు ఇచ్చాడు. తాజాగా పంజాబ్‌తో మ్యాచ్‌లో ఏకంగా 75 పరుగులు సమర్పించుకున్నాడు. ఆరు మ్యాచుల్లో కేవలం ఐదు వికెట్లే పడగొట్టాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటే.. వైవిధ్యంగా బంతులేస్తేనే ఫలితం సానుకూలంగా వస్తుందనేది కాదనలేని సత్యం. ఈ విషయంలో షమీ కాస్త సమయస్ఫూర్తి ప్రదర్శించాలి. స్లో బంతులు, ఆఫ్ కట్టర్లు, బౌన్సర్లను సరైన సమయంలో సంధిస్తేనే ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయగలమని క్రికెట్ విశ్లేషకుల సూచన.


**నిలకడ లేకుండా..**

కెప్టెన్ పాట్ కమిన్స్ సూపర్ బౌలర్. ఆసీస్ జట్టును బౌలింగ్ ప్రతిభతో గెలిపించాడు. గత ఐపీఎల్ సీజన్‌లోనూ హైదరాబాద్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లాడు. మరి అలాంటి కమిన్స్ నుంచి ఈసారి పేలవ బౌలింగ్ రావడం అభిమానులను షాక్‌కు గురి చేస్తోంది. అయితే, దీనికి కారణం కూడా లేకపోలేదు. షమీ తేలిపోవడంతో ఆ భారం కమిన్స్‌పై పడుతోందనేది కొందరి వాదన. గతంలో పవర్ ప్లే స్పెషలిస్ట్ భువనేశ్వర్ ముందుండి నడిపించేవాడు. తొలి ఆరు ఓవర్లలో ప్రత్యర్థికి చెందిన బ్యాటర్లను ఒత్తిడికి గురి చేసి వికెట్ తీసేవాడు. ఆ తర్వాత నట్టూ (నటరాజన్) కూడా కట్టుదిట్టంగా బంతులేసేవాడు. ఎలాంటి ఒత్తిడి లేకుండా కమిన్స్ విజృంభించేవాడు. ఈసారి కొన్ని మ్యాచుల్లో ఫర్వాలేదనిపించినా సరిపోలేదు. ఆరు మ్యాచుల్లో 4 వికెట్లే పడగొట్టాడు. ఆడమ్ జంపాను రెండు మ్యాచుల్లో ఆడించినా పెద్దగా ప్రయోజనం దక్కలేదు. 8 ఓవర్లలో 94 పరుగులు సమర్పించాడు. హైదరాబాద్ తరఫున హర్షల్ పటేల్ టాప్ వికెట్ టేకర్. ఇప్పటి వరకు 8 వికెట్లు తీశాడు. కానీ, భారీగా పరుగులు ఇస్తుండటం కలవరానికి గురి చేసే అంశం. మొత్తం 17 ఓవర్లలో 164 పరుగులు అంటే దాదాపు 9కిపైగా సగటుతో బౌలింగ్ చేస్తున్నాడు. యువ స్పిన్నర్ జీషాన్ అన్సారీ తనకొచ్చిన ఛాన్స్‌ను సద్వినియోగం చేసుకుంటున్నాడు. సిమర్‌జిత్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోలేక ఇబ్బంది పడ్డాడు.

**బ్యాటింగ్‌పైనే భారం వద్దు..**

ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ నుంచి సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లపైనే ఎక్కువ ఒత్తిడి ఉంది. ఓడిపోయిన వాటిల్లో బ్యాటింగ్ విభాగం సరిగా ఆడలేదని విమర్శలు చేసినా.. కీలకంగా వ్యవహరించాల్సిన బౌలింగ్ ఏ దశలోనూ మెప్పించలేదు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా లేనప్పుడు బౌలర్లే బాధ్యతాయుతంగా ప్రత్యర్థిని కట్టడి చేయాలి. అలా జరగడంలో విఫలమైనందునే సన్‌రైజర్స్‌కు వరుసగా నాలుగు పరాజయాలు ఎదురైనట్లు గణాంకాలు చూస్తే తెలిసిపోతుంది. ఎస్ఆర్‌హెచ్ ఇంకా 8 మ్యాచులు ఆడాల్సి ఉంది. ప్రస్తుతం ఖాతాలో నాలుగు పాయింట్లు ఉన్నాయి. ప్లేఆఫ్స్ చేరుకోవాలంటే కనీసం ఆరు మ్యాచుల్లో గెలవాలి. అలా జరగాలంటే కేవలం బ్యాటింగ్‌తోనే కాకుండా.. మెరుగైన బౌలింగ్ ఉంటేనే తేలికగా మారుతుంది.

# కోహ్లి సింపుల్ క్యాచ్ మిస్.. కీలక ఇన్నింగ్స్‌తో అదరగొట్టిన జురెల్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదివారం (ఏప్రిల్ 13) రాజస్థాన్ రాయల్స్ తో జరుగుతున్న మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి ఈజీ క్యాచ్ మిస్ చేశాడు. ఇన్నింగ్స్ 17 ఓవర్ చివరి బంతికి ఈ సంఘటన చోటు చేసుకుంది. సుయాష్ శర్మ వేసిన 17 ఓవర్ చివరి బంతిని ధృవ్ జురెల్ లాంగ్-ఆఫ్ లో భారీ షాట్ కొట్టాడు. టైమింగ్ సరిగా కుదరకపోవడంతో.. ఈ క్యాచ్ నేరుగా కోహ్లి చేతుల్లోకి వెళ్ళింది. అయితే ఈ ఈజీ క్యాచ్ ను కోహ్లి జారవిడిచారు. చేతుల్లోకి వచ్చిన ఈ క్యాచ్ మిస్ చేయడం ఆర్సీబీకి కొంత మైనస్ అనే చెప్పాలి. కోహ్లి క్యాచ్ మిస్ చేసినప్పుడు జురెల్ 11 పరుగుల వద్ద బ్యాటింగ్ చేస్తున్నాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న రాజస్థాన్ వికెట్ కీపర్ ఆ తర్వాత కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఓవరాల్ గా 23 బంతుల్లోనే 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 35 పరుగులు చేశాడు. కోహ్లి గనుక క్యాచ్ పట్టి ఉంటే రాజస్థాన్ కనీసం 10 పరుగులైనా తక్కువ చేయగలిగేది. క్యాచ్ లు జారవిడవడం సహజం. కానీ కోహ్లి మిస్ చేసిన ఈ క్యాచ్ బెంగళూరు విజయావకాశాలపై ఎంత వరకు ప్రభావం చూపుతుందో చూడాలి. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 పరుగుల డీసెంట్ టోటల్ చేయగలిగింది. ఓపెనర్ యశస్వి జైశ్వాల్ (47 బంతుల్లో 75:10 ఫోర్లు, 2 సిక్సర్లు) బాధ్యతగా ఆడి హాఫ్ సెంచరీ చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, యష్ దయాల్, హేజల్ వుడ్, కృనాల్ పాండ్య తలో వికెట్ తీసుకున్నారు.

# అదరగొట్టిన ఆర్సీబీ ఓపెనర్లు.. రాజస్థాన్‌పై విజయం..



జయపుర: ఐపీఎల్ 2025లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌పై బెంగళూరు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్లు సాల్ట్ 65 (33 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సులు), కోహ్లి 62లి (45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) అదరగొట్టడంతో 174 పరుగుల లక్ష్యాన్ని బెంగళూరు 17.3 ఓవర్లలోనే ఛేదించింది. లక్ష్య ఛేదనలో భాగంగా బరిలోకి దిగిన బెంగళూరు మొదటి ఓవర్ నుంచే రాజస్థాన్‌పై ఎదురు దాడికి దిగింది. ఒకవైపు సాల్ట్, మరోవైపు కోహ్లి ఫోర్లు, సిక్సులు కొడుతూ పరుగుల వరద పారించారు. వీళ్లిద్దరి దూకుడు చూస్తే, మొత్తం టార్గెట్‌ను వీళ్లే పూర్తి చేసేలా కనిపించారు. ఈ క్రమంలో కార్తికేయ వేసిన బంతిని ఎదుర్కొన్న ఫిలిఫ్ సాల్ట్.. యశస్వికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్ 40లి (28 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్) కలిసి కోహ్లి మ్యాచ్ ముగించాడు. రాజస్థాన్ బౌలర్లలో కార్తికేయకు ఒక వికెట్ దక్కింది. ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఫిలిప్ సాల్ట్ ఎంపికయ్యాడు.

అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. జైస్వాల్ 75 (47 బంతుల్లో, 10 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధశతకంతో రాణించాడు. చివర్లో ధ్రువ్ జురెల్ (35లి) అదరగొట్టాడు. కెప్టెన్ సంజు(15) నిరాశపర్చాడు. రియాన్ పరాగ్ 30 పరుగులతో ఫర్వాలేదనిపించాడు. హిట్‌మెయర్ 9, నితీశ్ రాణా 4లి పరుగులు చేశారు. బెంగళూరు బౌలర్లలో యశ్, హెజిల్‌వుడ్, కృనాల్, భువీ ఒక్కో వికెట్ తీశారు.

# నయన్ దూకుడు తగ్గడానికి రీజన్ అతనేనా..?






కోలీవుడ్ లేడీ సూపర్ స్టార్ నయనతార ఈమధ్య కాస్త దూకుడు తగ్గించిందని చెప్పొచ్చు. బాలీవుడ్ లో జవాన్ సినిమా చేసి సూపర్ హిట్ అందుకున్న నయనతార కోలీవుడ్ లో వరుస సినిమాలు చేస్తుంది. ఐతే ఎందుకో అమ్మడు ఇదివరకు అంత దూకుడు చూపించలేక పోతుంది. అంతేకాదు స్టార్ సినిమా ఆఫర్లు కూడా చాలా తగ్గిపోయాయి. ఇదివరకు అక్కడ టాప్ స్టార్స్ ఒకరు కాకపోతే మరొకరు నయనతారతో సినిమాలు చేస్తుంటారు.

ఆమె డేట్స్ అడ్జెస్ట్ కాకపోయినా సరే టైం ఇచ్చి మరీ ఆమెను తీసుకునే వారు. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తే అలా లేదు. నయనతారకు అవకాశాలు రాకపోవడం వెనక రీజన్ ఆమె ధనుష్ తో పడిన గొడవే అన్న టాక్ ఉంది. నయనతార పెళ్లి డాక్యుమెంటరీ పై ధనుష్ కేసు వేయడంపై తిరిగి నయన్ కూడా అదే రేంజ్ లో ఎటాకింగ్ కి దిగింది.ఐతే ఇక్కడ తప్పు ఎవరిది అన్నది పక్కన పెడితే నయన్ ధనుష్ మధ్య ఉన్న దూరం ఆడియన్స్ కు తెలిసింది. ఈ క్రమంలో ధనుష్ వల్ల నయనతారకు అవకాశాలు రాకుండా అవుతున్నాయి. కారణం అతనా కాదా అన్నది పక్కన పెడితే ధనుష్ తో నయన్ గొడవ ఆమె కెరీర్ మీద ఎఫెక్ట్ పడేలా చేసిందని చెప్పొచ్చు. ధనుష్ తో నయనతార కూడా కలిసి నటించింది. వాళ్లిద్దరు కలిసి నటించినప్పుడు ఎలాంటి గొడవలు లేవు.ఎప్పుడైతే ధనుష్ నిర్మాణంలో చేసిన నాన్ రౌడీ ధాన్ సినిమా క్లిప్ ని తన డాక్యుమెంటరీలో వాడిందో అప్పటి నుంచి ఆమెకు ధనుష్ తో దూరం పెరిగింది. ఇద్దరు ఎదురుపడ్డా పలకరించుకోలేనంతగా పరిస్థితులు వచ్చాయి. ఇలా స్టార్ హీరో స్టార్ హీరోయిన్ ఫైట్ పరిశ్రమకు మంచిది కాదని తెలిసినా కూడా వాళ్లు దాన్ని కొనసాగిస్తున్నారు.ఇక ఇదే దారిలో నయనతారకు రావాల్సిన అవకాశాలు కూడా కొన్ని మిస్ అవుతున్నట్టు తెలుస్తున్నాయి. మరి నయనతార ధనుష్ మధ్య ఈ డిస్టన్స్ ని ఎవరు దగ్గర చేస్తారన్నది చూడాలి. ఎవరికి వారు తమ సినిమాలు చేస్తూ ఉన్నా కూడా నయనతార కెరీర్ లో స్పీడ్ తగ్గిందన్నది మాత్రం ప్రత్యక్షంగా కనిపిస్తుంది.




On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com